

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్ గిరి | గురువారం | 17-09-2026 | సంపుటి: 3 | సంచిక: 224 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | THURSDAY | 17-09-2026 | V0LUME : 3 | ISSUE : 224 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


# కేసీఆర్ ఫామ్ హౌస్ భూములపై విచారణ

## 30 రోజుల్లో పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అదేశాలు



- కల్వకుంట్ల కుటుంబ ఆస్తులపై సర్వే నంబర్లతో సహా వెల్లడి
- ఫామ్ హౌస్ పరిధిలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్న సీఎం
- ప్రభుత్వ భూమిగా తేలితే పేదలకు పంచుతామని ప్రకటన

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**
మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్ పరిధిలోని భూములపై సమగ్ర విచారణకు సీఎం రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ వేదికగా ఈ సంచలన ప్రకటన చేసిన సీఎం.. కేసీఆర్ ఫామ్ హౌస్ ఆధీనంలో వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విచారణను 30 రోజుల్లోగా పూర్తి చేయాలని స్పష్టం

మిగతా 2వ పేజీలో..

## ధరణిని అడ్డంపెట్టుకున్నారు.. పట్టాలు చేసుకున్నారు

- 22ఏ పేరుతో నిండలు వేయాలనుకున్నారు
- మేము అన్నీ బయటపెడుతున్నాం
- వీటిపై చర్చ జరగకూడదనే గందరగోళం చేశారు
- శాసన సభలో బీఆర్ఎస్‌పై సీఎం తీవ్ర విమర్శలు

2

ధరణి

## వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉండదు



- దామాషా ప్రకారం సీట్లు పెంచితే డీలిమిటేషన్‌కు మద్దతు
- జిందాల్ వర్సిటీలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఉపన్యాసం

2

## పాలమూరు నీటి గోస తీర్చిన భగీరథుడు కేసీఆర్

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పాలమూరు-రంగారెడ్డి పథకం నార్లాపూర్ పంపులు ప్రారంభించి మూడేళ్లు

2

## బీఆర్ఎస్ భూములపై బీజేపీ దండయాత్ర



- ఆ భూముల్లో కాషాయ జెండాలు ఎగరేసి పేదలకు పంచుతాం
- ఏఐసీసీకి ఈఎంఐ కట్టేందుకే భూముల చిట్టా విప్పారు
- కేసీఆర్ ఫాంహౌజ్‌లో సర్కార్ భూమి ఉందని తేల్చడానికి 33 నెలలు పట్టిందా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**
బీఆర్ఎస్ దోచుకున్న భూములపై బీజేపీ ఆధ్వర్యంలో దండ యాత్ర చేస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ భూముల్లో కాషాయ జెండా ఎగరేసి పేదలకు పంచి పెడతామని చెప్పారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ భూ దోపిడీని సీఎం ప్రస్తావించడం వెనుక పెద్ద మతలబు ఉందన్నారు. యూపీ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీకి ఈఎంఐ కట్టేందుకే

మిగతా 2వ పేజీలో..



## సిట్టింగ్ జడ్జితో విచారణకు మేము సిద్ధం

- రేవంత్ కుటుంబీకుల ఆస్తుల పెరుగుదలపై ఎంక్వైరీ జరగాలి
- మాజీ మంత్రి హరీష్ రావు

2



## గజం భూమి ఎక్కువ ఉన్నా సరెండర్ చేస్తా

- సీఎం ప్రస్తావించిన అందరి భూములపై సీబీఐ విచారణ జరపాలి
- గుంపు మేస్త్రీతో గుంటనక్క కుమ్మక్కు ముమ్మాటికీ వాస్తవం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



## హైదరాబాద్‌ను నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం

- సింగపూర్ ప్రతినిధులతో సీఎం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**
తొలి దశలో మూసా, ఈసా నదుల సంగమం గాంధీ సరోవర్ వరకు మూసీ పునరుజ్జీవనం చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రివర్ ఫ్రంట్ అభివృద్ధితోపాటు నైట్ ఎకానమీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సింగపూర్

మిగతా 3వ పేజీలో..



## ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు ప్రోత్సహించండి

- సింగపూర్ కంపెనీలకు విస్తృత అవకాశాలు
- ఆ దేశ ప్రతినిధుల బృందంతో మంత్రి శ్రీధర్‌బాబు

2



## ఝీరాం వ్యాలీ కేసులో 10 మందికి మరణశిక్ష

- 2013 నాటి మావోయిస్టు దాడి కేసులో కీలక తీర్పు
- కాంగ్రెస్ పరివర్తన్ ర్యాలీపై దాడిలో 32 మంది మృతి
- ముద్దాయిలను దోషులుగా నిర్ధారించిన ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం
- దాడి వెనుక నెట్‌వర్క్, కుట్రపై సాగిన దర్యాప్తు
- తదుపరి న్యాయపరమైన ప్రక్రియపై ఉత్కంఠ

4

# పొదుపుతోనే డిమాండ్‌ను దాటగలం



- ఇంధన సామర్థ్యమే మరో విద్యుత్ కేంద్రం
- రాష్ట్రంలో పరిశ్రమలకు అనుకూల వాతావరణం
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా లక్ష్యం
- సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్‌లో డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**
విద్యుదుత్పత్తితోపాటు వినియోగాన్ని సమర్థవంతంగా తగ్గించడం ద్వారా కూడా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను అధిగమించవచ్చని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 'మనం ఉత్పత్తి చేసే విద్యుత్ యూనిట్ కంటే అవసరం లేకుండా పొదుపు చేసే విద్యుత్ యూనిటే చౌకైనది' అని పేర్కొన్నారు. ఇంధన సామర్థ్యాన్ని పర్యావరణ పరిరక్షణ అంశంగా కాక ఆర్థిక పోటీతత్వాన్ని పెంచే వ్యూహంగా చూడాలని సూచించారు. హెచ్ఐసీసీలో బుధవారం జరిగిన 25వ సీఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్ 2026లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఇప్పటివరకు ఇంధన విధానాన్ని ప్రధానంగా సరఫరా కోణంలోనే చూశామన్నారు. ఎంత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది.. ఎంత బొగ్గు అందుబాటులో ఉంది.. ఎంత పునరుత్పాదక విద్యుత్‌ను జోడించగలం.. ఎంత ట్రాన్స్‌మిషన్ మౌలిక వసతులు అవసరం వంటి అంశాలపై దృష్టి పెట్టామని చెప్పారు. అయితే

మిగతా 3వ పేజీలో..



## అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

- 2024 సంవత్సరానికి పురస్కారానికి ఎంపికైన ప్రముఖ నటుడు
- కన్నడ సినీ రంగంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న నటనా ప్రస్థానం
- కథానాయకుడిగా, సహాయ నటుడిగా విభిన్న పాత్రల్లో గుర్తింపు
- తెలుగు సహా ఇతర భాషల చిత్రాల్లోనూ నటించిన అనంత్ నాగ్
- సుదీర్ఘ సినీ సేవలకు ప్రతిష్ఠాత్మక గౌరవం

4

## అప్పుడు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?




- హరీష్‌రావుపై మంత్రి పొంగులేటి ఘాటు వ్యాఖ్యలు
- పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై నకిలీ ఎన్‌వోసీ ఆరోపణ
- గంగుల విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్
- 22ఏలో నాలుగు లక్షల ఎకరాలే పట్టా భూములు

2

## వినాయక నిమజ్జనంలో విషాదం

- ఆరుగురు విద్యార్థుల మృతి
- చెరువులో మట్టి కోసం తీసిన గుంతలతోనే ప్రమాదం
- ఈత రాకపోవడంతో విగ్రహం సహా మునిగిపోయిన విద్యార్థులు
- ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే జీఎంఆర్
- ప్రాచీన్ హాస్పిటల్‌కు చేరుకున్న సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్
- మంత్రి సీతక్క దిగ్భ్రాంతి



3

# బీఆర్ఎస్ భూములపై బీజేపీ దండయాత్ర

**మొదటిపేజీ తరువాయి**

అసెంబ్లీలో ప్రస్తావించి ఆ పార్టీతో బేరసారాలకు సిద్ధమయ్యారని చెప్పారు. భూముల విచారణ పేరుతో బీఆరఎస్‌తో చీకటి ఒప్పందం ఖాయం.. యూపీ ఎన్నికల కోసం అవసరమైన డబ్బులను బీఆర్ఎస్ సర్దడం తథ్యం అన్నారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌లతో కలిసి సంజయ్ మానకొండూరు, చింతకుంట, కొత్తపల్లి ప్రాంతాల్లో బుధవారం పర్యటించి గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఉత్సాహంగా నిమజ్జనోత్సవాలు జరుపుకునేలా ఏర్పాట్లను చేయాలని అధికారులను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కరీంనగర్‌లో గణేశ్ నిమజ్జనోత్సవాల కోసం రూ.1.5 కోట్లను కేటాయించామని, గతేడాదితో పోలిస్తే మూడింతలు ఎక్కువ అని చెప్పారు. నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా మ□డు రోజుల ముందే నీళ్లను విడుదల చేయాలన్నారు. ప్రజల సెంటిమెంట్‌తో ఆటలాడితే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎనిమిదిమంది ఎమ్మెల్యేల భూబాగోతం గురించి మాట్లాడటానికి గంట సమయం పట్టింది. మరి 90 మంది ఎమ్మెల్యేల భూబాగోతం గురించి మాట్లాడాలంటే ఎన్ని రోజులు అసెంబ్లీ నిర్వహించాలి అని ప్రశ్నించారు. రాష్ట్రం.లో 60 శాతం మంది ప్రజలకు భూముల్లేవు. 25 లక్షల కుటుంబాలకు ఇల్లు కట్టుకోవడాని గజం జాగా కూడా లేదన్నారు. కానీ బీఆర్ఎస్ నేతలు మాత్రం వేల ఎకరాలను దోచుకున్నారు అని ఆరోపించారు. పాదయాత్రలో నేను భూ దోపిడీ గురించి మాట్లాడితే కేసీఆర్ తన తలను ఆరు ముక్కలు చేస్తానన్నారు.. అయినా కేసీఆర్ మెడలు వంచి ఫాంహౌజ్ నుండి గుంజుకొచ్చి ప్రజల ముందుంచిన అని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు వేల ఎకరాల భూమిని కబ్జా చేశారని చెప్పడానికి వెయ్యి రోజులు పట్టిందా సీఎంగారూ.. బీఆర్ఎస్ నేతలతో డీల్ కుదరలేదా.. ఏఐసీసీకి కట్టాల్సిన ఈఎంఐ గడువు ముంచుకొస్తుండటంతో ఒత్తిడి పెరిగిందా.. అసెంబ్లీ వేదికగా వివరాలు బయటపెట్టి వారికి ఓపెన్ ఆఫర్ ఇస్తున్నారా అని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా 'సిట్' పేరుతో మీరు నియమించిన విచారణ కమిటీలు ఏమయ్యాయి అని అడిగారు. బేరాలు కుదరగానే సిట్‌ను నీరుగార్చడం సీఎంకు అలవాటే కదా అని ఎద్దేవా చేశారు. సీఎం సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్ లా కమిటీలు మారాయన్నారు. ఈ భూములపై కూడా విచారణ పేరుతో ఇంకెన్నాళ్లు లాగుతారు అని అడిగారు. కలెక్టర్లకు పూర్తి అధికారాలిస్తే 24 గంటల్లో పూర్తి నివేదిక ఇస్తారు.. కానీ 30 రోజుల గడువు పేరుతో డీల్ కుదుర్చుకోవాలనుకుంటున్నారా అని రేవంత్‌ను ఆయన ప్రశ్నించారు. రూ.లక్షల కోట్ల విలువైన కేసీఆర్ ఫాంహౌస్‌లోని భూములను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదన్నారు. విద్యుత్ కొనుగోళ్లు, ఈ ఫార్ములా రేసు, కాళేశ్వరం, గొర్రెల స్కాంసహా కేసులన్నీ ఏమయ్యాయి అని అడిగారు. పేదలు అటవీ భూముల్లో సాగు చేస్తే నానా ఇబ్బందులు పెడతారు కదా.. వందల ఎకరాల అటవీ భూమిని కబ్జా చేస్తే చర్యలేవి అని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆరఎస్‌లు దొందూ దొందే.. సీఎం మాట చెబితే అది శాసనం కావాలి. కానీ బీఆర్ఎస్‌తో బేరసారాల కోసం భూ దోపిడీని వాడుకోవడం సిగ్గు చేటు.. ప్రజలు ఛీకొడుతున్నారు అని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల చీకటి ఒప్పందాలపై జనం తిరగబడే రోజులు రాబోతున్నాయి అని హెచ్చరించారు. కాగా, తెలంగాణను అభివృద్ధి చేయాలని మోదీ తాపత్రయ పడుతున్నారని, అందులో భాగంగా బుల్లెట్ ట్రైన్లను మంజూరు చేస్తే వాటికి కేటాయించిన భూములను సైతం బీఆర్ఎస్ వాళ్లు చేశారని మంత్రి సంజయ్ ఆరోపించారు.

# సిట్టింగ్ జడ్జితో విచారణకు మేము సిద్ధం

**హైదరాబాద్, సెప్టెంబర్ 16:**

'మీ హయాంలో ఏం అవకతవకలు జరిగినయో.. మా హయాంలో ఏం జరిగినయో మొత్తం మేం విచారణకు సిద్ధం. సుప్రీంకోర్టు జడ్జితో చేయిద్దామా ? హైకోర్టు సిట్టింగ్ జడ్జితో చేయిద్దామా రేవంత్ రెడ్డి' అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్ లో బుధవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమిటీలంటూ కాలయాపన చేస్తున్న సీఎం తన సొంత ఇల్లు విషయంలో మాత్రం ఎలాంటి కమిటీలు వేయకుండా ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. కేటీఆర్ మీద, తన మీద, బీఆర్ఎస్ నాయకుల మీద ఎన్ని ఆరోపణలు చేసినా తాము విచారణకు సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి మొదలుకుని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 2023 డిసెంబర్ 7 నుంచి నేటి వరకు 'భూభారతి' వరకు జరిగిన ప్రతి అవకతవకపై సమగ్ర విచారణ జరిపించుకుందామని సవాల్ విసిరారు.

**రేవంత్ కుటుంబం ఆస్తులపై విచారణ జరగాలి**

తమ ఆస్తులతోపాటు రేవంత్ రెడ్డి, ఆయన తమ్ముళ్ల ఆస్తులు ఎలా పెరిగినాయనే దానిపై కూడా సిట్టింగ్ జడ్జితో ఎంక్వైరీకి సిద్ధమా అని హరీశ్ రావు సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి కుటుంబానికి ఏకంగా 308 ఎకరాల భూమి ఉందని తమకు సమాచారం వచ్చిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి భూమి పక్కనే ఓఆర్ఆర్ అలైన్మెంట్, బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు కూడా వచ్చాయని పేర్కొన్న ఆయన ఫ్యూచర్ సిటీ చుట్టూ, ఇతర ప్రాంతాల్లో ఉన్న భూముల వివరాలన్నింటినీ సేకరిస్తున్నామని స్పష్టం చేశారు.

# అప్పుడు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు?

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**

మాజీ మంత్రి హరీష్‌రావుపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌కు ఏ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా అది తప్పేనని, అలాంటప్పుడు తన మామ భూముల విషయంలో రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందని హరీష్‌రావును ప్రశ్నించారు. అప్పుడు నీ బుద్ధి ఎక్కడికి పోయింది అని అడిగారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో మాట్లాడిన పొంగులేటి తన మామ భూములకు గత కాంగ్రెస్ ప్రభుత్వమే ఎన్‌వోసీ ఇచ్చిందన్న హరీష్‌రావు వ్యాఖ్యలపై స్పందించారు. అసైన్డ్ భూములకు అనుమతి ఇవ్వడం చట్టబద్ధం కాదని, ఏ ప్రభుత్వం అలా చేసినా తప్పేనని అంటూ ఆ విషయం హరీష్‌రావుకు తెలియదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భూదాన్ భూమిని నకిలీ ఎన్‌వోసీతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పొంగులేటి ఆరోపించారు. అది కూడా తప్పేనన్నారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ విషయంలోనూ నిషేధిత భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని ఆరోపించారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్టేటస్‌కో ఉత్తర్వులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ఏ సర్కార్ రిజిస్ట్రేషన్ చేసినా అది తప్పేనని స్పష్టం చేశారు. 22ఏ నిషేధిత జాబితాపైనా పొంగులేటి కీలక వివరాలు వెల్లడించారు. ఈ జాబితాలో ఉన్న భూముల్లో నాలుగు లక్షల ఎకరాలు మాత్రమే పట్టా భూములని, మిగిలిన భూమంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 22ఏ జాబితా నుంచి 47,440 ఎకరాలు తగ్గించినట్లు అసెంబ్లీలో ఇప్పటికే వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ అక్రమాలపై త్వరలోనే పూర్తి వివరాలు బయటపెడతామని పొంగులేటి తెలిపారు. 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వం త్వరలో కీలక నిర్ణయాలు తీసుకోనుందని చెప్పారు.

# కేసీఆర్ ఫామ్ హౌస్ భూములపై విచారణ

**మొదటిపేజీ తరువాయి**

చేశారు. ఒకవేళ సకాలంలో విచారణ పూర్తి చేయకపోతే సంబంధిత అధికారులు, మంత్రులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమాన్ని అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విపరీతంగా ఆస్తులు కూడబెట్టారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కల్వకుంట్ల కుటుంబం పేరు మీద ఎక్కడెక్కడ, ఎన్ని ఎకరాల స్థిరాస్తులు ఉన్నాయో సర్వే నంబర్లతో సహా సభలో చదివి వినిపించారు. కేసీఆర్ దంపతులకు 27 ఎకరాలు ఉండాల్సి ఉండగా ఏకంగా 67 ఎకరాల భూమి ఉందని తెలిపారు. కేటీఆర్ కుటుంబంలో నలుగురి పేరు మీద 123 ఎకరాల భూములు ఉన్నాయని వెల్లడించారు. ఇందులో కేటీఆర్ పేరు మీద 49.5 ఎకరాలు, ఆయన భార్య శైలిమ పేరు మీద 17.5 ఎకరాలు, అలేఖ్య పేరు మీద 9.38 ఎకరాలు, హిమాన్ష్ పేరు మీద 46.3 ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. ఉద్యమాన్ని, ధరణిని అడ్డంపెట్టుకుని భారీగా దోపిడీ చేశారని దుయ్యబట్టారు. కేసీఆర్ ఫామ్ హౌస్ పరిధిలో దాదాపు 340 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అసలు ఆ ఫామ్ హౌస్ భూమి కథేంటో తేల్చాలని ఇప్పుడే కలెక్టర్‌ను ఆదేశిస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్‌కు తక్షణమే నోటీసులు ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అధికారుల విచారణలో అది ప్రభుత్వ భూమిగా తేలితే, ఆ భూమినంతటినీ పేదలకు పంచుతామని ఆయన స్పష్టం చేశారు. హరీష్ రావు.. ఫాం హౌస్ రంగనాయక సాగర్ దగ్గర ఉందని.. హరీష్‌రావు తన ఫాం హౌస్‌కు స్పెషల్ గా రోడ్డు వేయించుకున్నాడని చెప్పారు. 10 ఎకరాల ఇరిగేషన్ భూమిని సుడాకు హరీశ్ బదిలీ చేయించాడని సీఎం రేవంత్ చెప్పారు. 9 జిల్లాలు, 24 మండలాలు, 31 గ్రామాల్లో కేసీఆర్ ఫ్యామిలీకి 440 ఎకరాల భూమి ఉందని సీఎం ప్రకటించారు. సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో హరీశ్ రావు ఫాంహౌస్‌కు రోడ్లు వేయించుకున్నాడని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి ఫ్యామిలీకి షాబాద్ లో 47 ఎకరాలు ఉన్నాయని సీఎం చెప్పారు. ఇందులో 11.5 ఎకరాల ఇనాం భూములు తీసుకున్నారని.. ఇనాం భూములు జగదీశ్వర్ రెడ్డికి ఎలా పట్టా అయిందని సీఎం రేవంత్ ప్రశ్నించారు. పైలెట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ అసైన్డ్ భూముల్లో ఉందని సీఎం వెల్లడించారు. కిషన్ రెడ్డి సొంతూరు తిమ్మాపూర్ లో కబ్జాలు చేశారని.. తిమ్మాపూర్ లో 77 ఎకరాల భూదాన్ భూమి ఉందని సీఎం చెప్పారు. 77 ఎకరాల భూదాన్ భూమి ప్రైవేట్ వ్యక్తుల పేరు పైకి వెళ్లిందని, అసలు భూదాన్ భూములు ఎలా పట్టా చేశారని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. 77 భూదాన్ భూములపై మాట్లాడితే సబిత తనను విమర్శిస్తోందని.. బహదూర్ పుర, తిమ్మాపూర్ భూములపై విచారణ జరగాలని సీఎం అభిప్రాయపడ్డారు. గోల్డ్ స్టోన్ ప్రసాద్ ఎవరికి బంధువని సీఎం ప్రశ్నించారు. నమస్తే తెలంగాణ ఎండీకి విలువైన కార్లు ఎలా వచ్చాయని విస్మయం వ్యక్తం చేశారు. గోల్డ్ స్టోన్ ప్రసాద్ నుంచి గిఫ్టలు తీసుకుంది మీరు కాదా అని బీఆర్ఎస్ ను ఉద్దేశించి రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. బోయిన పల్లి వినోద్, బోయినపల్లి శ్రీనివాస రావు కేసీఆర్ బినామీలు అని సీఎం రేవంత్ ఆరోపించారు. వట్టినాగులపల్లిలో శ్రీనివాసరావు కబ్జాలను బయటపెడతానని సీఎం స్పష్టం చేశారు. భూపాలపల్లిలో 106 ఎకరాల ఫారెస్ట్ భూములు తొలగించి రిజిస్ట్రేషన్ చేశారని సీఎం వివరించారు. గండ్ర వెంకటరమణా పేరుతో 106 ఎకరాల ఫారెస్ట్ భూమి రిజిస్ట్రేషన్ అయి ఉందని చెప్పారు. నెలిమలి గ్రామంలో 13 వందల ఎకరాల భూమి బీఆర్ఎస్ వ్యక్తి పట్టా చేసుకున్నాడని సీఎం బయటపెట్టారు. సిరిసిల్లలో 8 వేల ఎకరాల ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకు మారాయని, 8 వేల ఎకరాలు బీఆర్ఎస్ నేతల పేరుపైకి మార్చుకున్నారని సీఎం రేవంత్ ఆరోపించారు. హరీష్ రావు పేరు మీద 27 ఎకరాలు, ఆయన భార్య పేరు మీద 8 ఎకరాల భూమి ఉందని సీఎం చెప్పారు. కవిత ఫ్యామిలీకి 37 ఎకరాల భూమి ఉందని తెలిపారు. జోగినపల్లి సంతోష్ పేరుతో 53 ఎకరాలు ఉందని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా సర్వే నంబర్లతో సహా వివరాలను బయటపెట్టారు.

# వచ్చే ఎన్నికల్లో బీజేపీతో పొత్తు ఉండదు

**సోనిపట్(హర్యానా), సెప్టెంబర్ 16 :**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో (2028) బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో ఎలాంటి పొత్తు పెట్టుకోదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోనిపట్ (హర్యానా)లోని ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీలో ఇన్నోవేషన్ ఇన్ గవర్నెన్స్: ది స్టోరీ ఆఫ్ ఎ స్టార్టప్ స్టేట్ అనే అంశంపై ఆయన బుధవారం ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని రాజకీయాలు, పాలన, సాంకేతికత తదితర అంశాలపై వారి ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకునే అవకాశం ఉందా అని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు కేటీఆర్ పైవిధంగా స్పందించారు. డీలిమిటేషన్ పై మాట్లాడుతూ మొత్తం లోకసభ స్థానాల సంఖ్యను దేశవ్యాప్తంగా దామాషా ప్రకారం పెంచితే డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంలో తమ పార్టీకి ఎలాంటి అభ్యంతరం ఉండదని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం లోకసభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ప్రాతినిధ్యం ఉందని తెలిపారు. కృత్రిమ మేధస్సు(ఏఐ), సాంకేతిక మార్పులపై ప్రశ్నకు సమాధానమిస్తూ ప్రతి పెద్ద సాంకేతిక పరివర్తన సమయంలోనూ ఆందోళనలు వ్యక్తమయ్యాయని కేటీఆర్ అన్నారు. ప్రతి సాంకేతిక మార్పును ప్రశ్నించారు.. ఏఐ విషయంలోనూ అదే జరుగుతోంది. మనం దాన్ని స్వీకరించి ముందుకు సాగాలి అని సూచించారు. నిర్దిష్టత, అవకాశాలు అనే రెండు కాన్సెప్ట్‌ల ద్వారా తెలంగాణ అభివృద్ధి నమూనాను ఆయన వివరించారు. మౌలిక వసతులు, విశ్వసనీయమైన ప్రజా సేవల ద్వారా ప్రభుత్వం ప్రజలకు ఒక నిర్దిష్టమైన వాతావరణం కల్పించడంతోపాటు ఇన్నోవేషన్, వ్యవస్థాపకతను ప్రోత్సహిస్తూ ఒక ఇకోసిస్టమ్‌ను సృష్టించి, కొత్త అవకాశాలకు అనుకూలమైన వాతావరణాన్ని కూడా నిర్మించాలని అన్నారు. ఈ సందర్భంగా సాగునీరు, వ్యవసాయం, తాగునీరు, విద్యుత్ రంగాల్లో తెలంగాణ చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి కేటీఆర్ వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రస్తావిస్తూ కరవు ప్రభావిత తెలంగాణ ప్రాంతాలకు గోదావరి జలాలను ఎలా తరలించాలనే చారిత్రక సవాలుకు ఇంజినీరింగ్ పరిష్కారం ఈ ప్రాజెక్టు అని అభివర్ణించారు. తెలంగాణలో ధాన్యం(వరి) ఉత్పత్తి 201415లో సుమారు 44.4 లక్షల టన్నులు ఉంటే 202324లో అది 168.8 లక్షల టన్నులకు పెరిగిందని కేటీఆర్ తెలిపారు. ఇన్నోవేషన్ ఇకోసిస్టం గురించి మాట్లాడుతూ టీహబ్, వీహబ్, టీవర్క్స్, టాస్క్ వంటి సంస్థల పాత్రను వివరించారు. వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, మహిళలకు అవకాశాలు కల్పించడం, నమూనా రూపకల్పన, హార్డ్‌వేర్ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడం, యువతను పరిశ్రమలతో అనుసంధానం చేయడంలో వీటి పాత్రను వివరించారు. ఇంక్యుబేషన్, నమూనా రూపకల్పన నుంచి మార్కెట్‌కు సిద్ధమైన సంస్థగా ఎదిగిన స్కైరూట్‌ను తెలంగాణ ఇన్నోవేషన్ వ్యవస్థకు ఉదాహరణగా కేటీఆర్ ప్రస్తావించారు. పరిమితులను సమస్యలుగా చూడకుండా నిరంతరం నేర్చుకోవడం, మెరుగుపడటం, వాటిని అమలు చేయడంపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. ముఖాముఖిలో రాజకీయాలు, ప్రజా విధానాలు, డీలిమిటేషన్, కృత్రిమ మేధస్సు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులు పలు ప్రశ్నలు అడిగారు.. వాటికి కేటీఆర్ ఇచ్చిన సమాధానాలకు ప్రశంసలు వెల్లువెత్తాయి. తెలంగాణ ప్రగతి ప్రస్థానాన్ని వివరించే అవకాశం కల్పించినందుకు ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి, విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించే అవకాశం కల్పించినందుకు యూనివర్సిటీ యాజమాన్యానికి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ సి.రాజ్ కుమార్‌కు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

# పాలమూరు నీటి గోస తీర్చిన భగీరథుడు కేసీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**

ఉమ్మడి పాలనలో కరవు, వలసలకు నిలయంగా ఉన్న పాలమూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే దిశగా నాటి కేసీఆర్ ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం నార్లాపూర్ పంపులను ప్రారంభించి నేటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఈమేరకు స్పందించారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చడం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. పాలమూరు ప్రాంత ప్రజల దశాబ్దాల నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో కేసీఆర్ పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ జిల్లాల్లోని ప్రాంతాలకు సాగునీరు అందించడంతోపాటు తాగునీటి అవసరాలను తీర్చాలని ప్రణాళిక రూపొందించినట్లు అధికారిక ప్రాజెక్టు పత్రాలు పేర్కొంటున్నాయన్నారు. సుమారు 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు, 1,226 గ్రామాలకు తాగునీరు అందించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారని, 2023 సెప్టెంబర్ 16న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాగర్‌కర్నూల్ జిల్లా నార్లాపూర్ వద్ద ఈ ఎత్తిపోతల పథకం తొలి దశ వెట్ రన్‌ను ప్రారంభించారని గుర్తు చేశారు. నార్లాపూర్ పంప్‌హౌస్‌లో భారీ సామర్థ్యం కలిగిన పంపులను ఆన్ చేసి శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసే ప్రక్రియను ప్రారంభించారంటూ పంపు ప్రారంభించి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రాజెక్టులో మిగిలి ఉన్న పనులను ప్రభుత్వం వేగంగా పూర్తి చేసి పంట పొలాలకు నీటిని అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పాలమూరు ప్రజల నీటి అవసరాలను ప్రభుత్వం విస్మరించకుండా ప్రాజెక్టు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు ప్రోత్సహించండి

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**

భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని కోరారు. సెమీకండక్టర్ రంగంలో సింగపూర్‌కు ఉన్న సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణతో అనుసంధానించి రాష్ట్రంలో ఫ్యాబ్ పరిశ్రమలతోపాటు అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసేలా సింగపూర్ కంపెనీల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్‌బాబుతో సచివాలయంలో బుధవారం సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున తీసుకుంటున్న చర్యలను వివరించారు. హై వాల్యూ ఇండస్ట్రీస్, ఆర్ అండ్ డీ, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఐటీ/ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్ అండ్ డీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ కంపెనీలకు విస్తృత అవకాశాలున్నాయన్నాయన్నారు. ఆ మేరకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, అవకాశాలపై అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్



సమ్మిట్ 2026'లో సింగపూర్ ప్రభుత్వం, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, ఇండియా డైరెక్టరేట్ డైరెక్టర్ జీన్ యీ, సౌత్ ఏషియా ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ఆడ్రీ టూన్ తదితరులు పాల్గొన్నారు.

# ధరణిని అడ్డంపెట్టుకున్నారు.. పట్టాలు చేసుకున్నారు

**హైదరాబాద్, సెప్టెంబర్ 16 :**

ధరణిని అడ్డం పెట్టుకుని భూదాన భూములను పట్టా చేసుకున్నారు అని బీఆర్ఎస్ నేతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. శాసనసభలో బుధవారం ఆయన భూముల అక్రమ పట్టాలు, అసెంబ్లీ సమావేశాల మొదటి రోజు జరిగిన సంఘటనలపై మాట్లాడారు. గత ప్రభుత్వంలో అటవీ భూముల నుండి 106 ఎకరాల భూమి గండ్రకు అప్పగించారని, ఈ విషయంలో కలెక్టర్‌ను సుప్రీంకోర్టు తిట్టిందని చెప్పారు. సిరిసిల్లలో ఎనిమిది వేల అసైన్డ్ భూములు బదలాయించారన్నారు. సందీప్ ఝూను కలెక్టర్‌గా వేస్తే రెండు వేల ఎకరాలు బయటకు తీశారన్నారు. మైహోమ్ రామేశ్వర రావుకు ఎయిర్‌పోర్టుకు అనుకుని 2647 ఎకరాల భూమిని కట్టబెట్టారని ఆరోపించారు. ప్రజల సొమ్ము ఇలా కొల్లగొడతారా అని ప్రశ్నించారు. కాప్రాలో అవేక్యు ప్రాపర్టీ అని నమస్తే తెలంగాణలో రాయించారని, తర్వాత ధరణి తెచ్చి మేల్లచెరువులో భూదాన్ భూములు లాక్కుందని, మైహోమ్ 113 ఎకరాలు సిమెంట్ ఫ్యాక్టరీకి వాడుకుంటున్నారని చెప్పారు. అసైన్డ్ భూములు.. వక్ఫ్ భూములు అన్నీ మై హోమ్ వాళ్ళు లాక్కోవచ్చా అని ప్రశ్నించారు. భూములు ఎక్కడ కనిపించినా గద్దల లెక్క వాలిపోయారు.. లక్ష కోట్ల భూములు లాక్కున్నారు.. ఈ చర్చ రాకుండా ఉండాలనే సభలో గందరగోళం చేయాలని చూశారని సీఎం బీఆర్ఎస్ సభ్యులపై విమర్శలు గుప్పించారు. ఆడబిడ్డలను అడ్డంపెట్టుకుని అడ్డుకోవాలి అనుకున్నారు.. శిశుపాలునికి కూడా వంద తప్పులు చేస్తేనే శిక్ష పడింది.. ఎవరికి అయినా సమయం వస్తుంది.. అప్పుడే శిక్ష పడుతుంది అన్నారు. 22ఎను అడ్డంపెట్టుకుని తమపై నిందలు వేయాలని చూశారు.. తాము అన్నీ బయటపెడుతున్నామన్నారు. సంగారెడ్డిలో భూముల చిట్టా కూడా బయటపెడతా అన్నారు. ఇలాంటి వాళ్లను మనం క్షమిస్తే మనల్ని భవిష్యత్ తరాలు క్షమించవు అని సీఎం అన్నారు. వీటన్నింటిపై సిట్ విచారణకు సిఫార్సు చేస్తున్నానన్నారు. సామాన్య ప్రజల సమస్య పరిష్కారం అయ్యేలా కమిటీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**చరిత్ర కొంతమందిని ఎప్పుడూ క్షమించదు**

గతంలో తప్పిదాలపై చర్చ జరిగితేనే భవిష్యత్తులో పొరపాట్లు సరిదిద్దుకోవచ్చునని ముఖ్యమంత్రి అన్నారు. కానీ ప్రతిపక్షం గతంలో జరిగిన తప్పులను చర్చించకూడదని సభ నుంచి బయటకు వెళ్లిందన్నారు. విద్యుత్ కొరత రావాలి అని కొందరు క్షుద్ర పూజలు చేశారు ఇది కూడా సభలో చర్చకు వస్తుంది అని భయపడ్డారు.. తమ ప్రభుత్వానికి ప్రతీ ఆడబిడ్డ సమానమే.. సామాన్య మహిళలు అయినా గౌరవంగా చూసుకుంటాం.. కొంతమంది ప్రతిపక్ష నాయకులు వికృత చేష్టలతో వ్యవహరించారు అని అన్నారు. స్పీకర్‌గా ఒకరిని ఆమోదం పొందిన తరవాత అందరికీ సమాన హక్కులు కాపాడే పని చేస్తారని, అలాంటి చైర్‌ను కాపాడుకోవడానికి గత ప్రభుత్వం కమిటీ వేసి రూల్స్ రాసుకున్నారని తెలిపారు. శాసనసభ నిర్వహించడానికి ప్రొసీజర్ సిద్ధం చేసింది గత ప్రభుత్వమేనన్నారు. నినాదాలతో ఉన్న డ్రెస్ వేసుకుని రావద్దని సభ ఆమోదం చేసింది హరీష్ మంత్రిగా ఉన్నప్పుడేనన్నారు. పోలీసు అధికారులు వాళ్ళ డ్యూటీ వాళ్ళు చేస్తారు.. స్పీకర్ ఆదేశాలు అమలు చేస్తారు.. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా నల్ల చొక్కాతో వచ్చారు కదా అంటున్నారు.. నినాదాలతో కూడిన టి షర్ట్ వేసుకుని రావద్దు అని స్పీకర్ ఆదేశిస్తే అనుమతించరు.. పార్లమెంటు నిబంధనలు అక్కడ.. అసెంబ్లీలో నిబంధనలు ఇక్కడ అమలు చేస్తారు అని సీఎం స్పష్టం చేశారు. పోడియం లోపలికి వస్తే సభ్యుడు సస్పెండ్ అయినట్టే అని వారు చట్టం చేశారు.. కానీ మీరు గౌరవంగా క్షమించారు.. సభలో మైక్ ఇచ్చారు.. సభలో సభ్యులను, సభ బయట స్పీకర్‌ను దూషించారు.. సభలోకి వచ్చాకా మార్పు వచ్చి ఉంటుందేమో అని మైక్ ఇచ్చారు.. అప్పుడు కూడా అలాగే చేశారు.. అందుకే మీరు సస్పెండ్ చేశారు అని స్పీకర్‌నుద్దేశించి సీఎం అన్నారు.

# పొదుపుతోనే డిమాండ్‌ను దాటగలం

మొదటిపేజీ తరువాయి

మన ముందే మరో విద్యుత్ కేంద్రం ఉందని, దానికి పొగ గొట్టం, బొగ్గు గని, భూమి, కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్ అవసరం లేదని, అదే ఇంధన సామర్థ్యమని వివరించారు. మెరుగైన మోటర్లు, సమర్థవంతమైన శీతలీకరణ వ్యవస్థలు, ఇంధన సామర్థ్య భవనాలు, మెరుగైన పారిశ్రామిక ప్రక్రియలు, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రతి మెగావాట్ విద్యుత్ డిమాండ్‌ను శాశ్వతంగా తగ్గించగలిగితే మొత్తం విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో భవిష్యత్తులో విద్యుత్ అవసరం మరింత పెరుగుతుందని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమలు, తయారీ రంగం, డేటా సెంటర్లు, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులు రావాల్సి ఉందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతోపాటు ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నందున అభివృద్ధి వేగాన్ని తగ్గించడం పరిష్కారం కాదని, ప్రతి యూనిట్ విద్యుత్తుతో మరింత ఆర్థిక కార్యకలాపాలను సాధించడమే పరిష్కారమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పారిశ్రామిక సంస్థలు తక్కువ విద్యుత్ వినియోగిస్తే వాటి నిర్వహణ వ్యయం తగ్గుతుందన్నారు. తెలంగాణలో పీక్ విద్యుత్ డిమాండ్ తగ్గితే ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థలపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. దేశానికి ఇంధన భద్రత పెరగడంతోపాటు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం, ఉద్గారాలు తగ్గుతాయని వివరించారు. ఇంధన సామర్థ్యం వ్యాపార సంస్థల నిర్వహణ వ్యయాలను తగ్గించడంతోపాటు వనరుల ఉత్పాదకతను పెంచుతుందని చెప్పారు. గొప్ప ఆవిష్కరణలు ఎప్పుడూ ప్రయోగశాలల్లోనే జరగాల్సిన అవసరం లేదన్నారు.



ఒక పరిశ్రమలో విజయవంతమైన సాంకేతికత మరో పరిశ్రమకు ఉపయోగపడుతుందని చెప్పారు. సిమెంట్ పరిశ్రమలో పరిష్కరించిన సమస్య ఉక్కు పరిశ్రమకు ఉపయోగపడవచ్చని, పేపర్ మిల్లులో అమలు చేసిన ఇంధన సామర్థ్య విధానం ఇతర రంగాలకు ఆదర్శంగా నిలవవచ్చని అన్నారు. తదుపరి కొత్త సాంకేతికత ఏమిటి అనే ప్రశ్నతోపాటు ఇప్పటికే ఏది విజయవంతంగా పనిచేస్తోంది.. దాన్ని ఎంత వేగంగా విస్తరించగలం అనే ప్రశ్న కూడా ఉండాలి అని ఆయన సూచించారు. భారత్‌లో మంచి పైలట్ ప్రాజెక్టులకు కొరత లేదని, ఒక కర్మాగారంలో విజయవంతమైన ప్రయోగాన్ని వంద కర్మాగారాలకు విస్తరించడమే అసలు సవాలని అన్నారు.

**ఏఐతో ఇంధన వినియోగంలో సమర్థత**

ఇంధన సామర్థ్యంలో తదుపరి తరం సాంకేతికతలు కీలక పాత్ర పోషించనున్నాయని డిప్యూటీ సీఎం అన్నారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుదీకరణ, డిజిటలైజేషన్, స్మార్ట్ ఎనర్జీ మేనేజ్‌మెంట్‌తోపాటు కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. సెన్సర్ల ద్వారా ఎక్కడ విద్యుత్ వృథా అవుతుందో గుర్తించవచ్చని, డిజిటల్ వ్యవస్థలతో పారిశ్రామిక ప్రక్రియలను నిరంతరం మెరుగుపరచవచ్చని చెప్పారు. మానవ ఆపరేటర్లు గుర్తించలేని నమూనాలను కూడా కృత్రిమ మేధస్సు గుర్తించగలదన్నారు. భవిష్యత్తులో కర్మాగారాలు విద్యుత్ వినియోగదారులుగానే కాక విద్యుత్ వ్యవస్థలో చురుకైన భాగస్వాములుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన సామర్థ్యం విషయంలో పరిశ్రమలకు మూడు సూచనలు చేశారు. ఇంధన వినియోగాన్ని కొలవకుండా వ్యవస్థాగత మార్పులు చేయడం సాధ్యం కాదని, అందుకే దీనిని ఏడాదికోసారి నిర్వహించే ఆడిట్‌గా కాక నిరంతర పర్యవేక్షణ ప్రక్రియగా మార్చాలని స్పష్టం చేశారు. అలాగే, ఒక పరిశ్రమలో విజయవంతమైన పొదుపు విధానాలను ఇతర వందలాది సంస్థలు నేర్చుకుని అమలు చేసేలా అనుభవాల మార్పిడికి అనువైన వ్యవస్థను రూపొందించాలని పిలుపునిచ్చారు. దీంతోపాటు ప్రభుత్వం, ఆర్థిక, విద్య, సాంకేతిక సంస్థలు పరిశ్రమలతో కలిసి పనిచేస్తూ వాణిజ్యపరంగా లబ్ధి చేకూర్చే ఉత్తమ సాంకేతికతలను విస్తృత స్థాయిలో అన్ని సంస్థలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

**తెలంగాణకు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు**

తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని, అత్యుత్తమ అంతర్జాతీయ విమానాశ్రయం, మెరుగైన రహదారులు, ఔటర్ రింగ్ రోడ్, శక్తి, ప్రతిభ, అనుకూల వాతావరణంతోపాటు శాంతిభద్రతలు రాష్ట్రానికి బలమైన అంశాలని పేర్కొన్నారు. తెలంగాణ స్నేహపూర్వక, పారిశ్రామిక అనుకూల రాష్ట్రంగా ఉందన్నారు. పెట్టుబడిదారులను ప్రభుత్వం సంపద సృష్టికర్తలుగా భావిస్తోందన్నారు. కలిసి ఎదగడానికి తెలంగాణ రాష్ట్రానికి సంపద సృష్టికర్తలందరికీ స్వాగతం పలుకుతున్నాం అని భట్టి అన్నారు.

**2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ**

తెలంగాణ.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్యుత్ రంగంతోపాటు అన్ని ఇతర రంగాలను కూడా ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతులు, ఇంధన రంగం తదితర అంశాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

**డిసెంబర్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్**

ఈ ఏడాది కూడా డిసెంబర్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. మీ అందరూ గ్లోబల్ సమ్మిట్‌కు తప్పకుండా హాజరై తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. ప్రజలకు, పరిశ్రమలకు మరింత విద్యుత్ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రతి యూనిట్ విద్యుత్‌తో మరింత ఫలితాన్ని సాధించాలన్నారు. మరింత ఉత్పత్తి చేయాలి.. మరింత అభివృద్ధి చెందాలి.. వృథాను తగ్గించాలి అనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# నాణ్యమైన విద్యకు ప్రజా ఉద్యమమే పునాది

- ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఐసీయూలో ఉంది
- ప్రజలే వైద్యులై చికిత్స చేసి బతికించుకోవాలి
- తెలంగాణ విద్యా కమిషన్ మాజీ చైర్మన్ మురళి



ఖమ్మం, సెప్టెంబర్ 16 :

ప్రజలకు నాణ్యమైన విద్య లభించాలంటే రాజకీయ వ్యవస్థపై ప్రజలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలంగాణ విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. ప్రజల నుంచి డిమాండ్ లేకుండా ఏ పాలకవర్గం విద్యావ్యవస్థను సరిదిద్దుతుందని భావించలేమని, ఆశించడం కూడా పొరపాటేనని అన్నారు. ఖమ్మం మయూరి సెంటర్లోని ఓ హోటల్‌లో విద్యాభిమానులు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్తలతో బుధవారంజరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఐసీయూలో ఉందని, ప్రజలే డాక్టర్లుగా మారి దానికి చికిత్స చేసి బతికించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం 40 లక్షల మంది పిల్లల తల్లిదండ్రులు అధిక ఫీజులు చెల్లించి ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణకు చట్టం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని సౌకర్యాలు గల తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా మార్చితే ప్రైవేటు బడులకు పిల్లలను పంపాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 37శాతం మంది పిల్లలే చదువుతున్నారన్నారు. ఇలాగే అసౌకర్యంగా కొనసాగితే ప్రభుత్వ బడి మరింత దిగజారే ప్రమాదం ఉందన్నారు.

సమావేశంలో బస్సు యాత్ర లో పాల్గొన్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ కోర్ కమిటీ సభ్యులు ప్రొఫెసర్ పద్మజా షా, ఎం.చంపాలాల్, పి.అశోక్ కుమార్, సృజన యాదవ్, పోరన్న, ఎం.నర్సింహారావు, హరీష్, రుబీనా, నిఖిల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి సీనియర్ జర్నలిస్టు, ఎడ్యుకేషన్ ఎనలిస్టు ఎన్.తిర్మల్ మోడరేటర్ గా వ్యవహరించారు. సమావేశంలో డాక్టర్ యం.యఫ్ గోపినాథ్, భద్రూనాయక్, పిఆర్టీ యు జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్, టిపిటీ యఫ్ జిల్లా అధ్యక్షుడు జి.మల్లయ్య, యుటీయఫ్ ప్రతినిధి ఉద్దండు, ధర్మసమాజ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుంక రశ్రీనివాస్, పిడియస్యు జిల్లా కార్యదర్శి మ స్తాన్, బలహీనవర్గాల జాక్ కన్వీనర్ పి. రాంబాబు, కనకయ్య, రిటైర్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి టి.వేణు, నాగిరెడ్డి, ప్రజానాట్యమండలి దేవేందర్, బొబ్బిలి భారత్ చంద్ర, మణిభూషణాచారి, ఖలీల్, ఝాన్సీ, సునీత, సృజన, విజయకుమార్ గుంతేటి వీరభద్రం తదితర 30 మంది విద్యారంగం ప్రముఖులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రౌండుటేబుల్ సమావేశం ప్రభుత్వ బడులను సౌకర్యవంతంగా తీర్చిదిద్దడానికి మండలానికి నాలుగు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, ప్రైవేటు పాఠశాల ఫీజులు నియంత్రణ చేయాలని, చట్టబద్ధంగా విద్యకు బడ్జెట్‌లో ఏటా 18శాతం నిధులు కేటా యించాలని తీర్మానం చేసింది. ఈ మూడు అంశాలపై జరిగే ఉద్యమానికి సైతం సమావేశం సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

# వినాయక నిమజ్జనంలో విషాదం

- ఆరుగురు విద్యార్థుల మృతి
- చెరువులో మట్టి కోసం తీసిన గుంతలతోనే ప్రమాదం
- ఈత రాకపోవడంతో విగ్రహం సహా మునిగిపోయిన విద్యార్థులు
- ఘటనపై ఆరా తీసిన ఎమ్మెల్యే జీఎంఆర్
- ప్రాచీన్ హాస్పిటల్‌కు చేరుకున్న సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్
- మంత్రి సీతక్క దిగ్భ్రాంతి



పటాన్ చెరు, సెప్టెంబర్ 16 :

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతిచెందారు. నిమజ్జనం కోసం నేరేడు చెరువులో దిగి విద్యార్థులు మృతిచెందారు. మృతులను పెద్ద కంచర్ల చెందిన శిరీష చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులుగా గుర్తించారు. మృతులు నర్సింహ రాజు, సుమంత్ (డిప్లొమా సెకండ్ ఇయర్), గణేష్ (డిప్లొమా సెకండ్ ఇయర్), ఉదయ్ కిరణ్ (డిప్లొమా థర్డ్ ఇయర్), శ్యామ్ కుమార్ (డిప్లొమా ఫస్ట్ ఇయర్), సిద్ధార్థ్ (టెన్త్ క్లాస్) చదువుతున్నారు. విద్యార్థుల మృతి పట్ల పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాచీన గ్లోబల్ హాస్పిటల్‌కు వెళ్లి విద్యార్థుల మృతదేహాలకు నివాళులర్పించారు. గురువారం ఉదయం 10 గంటల లోపు పోస్టు మార్టం పూర్తి చేయాలని, తదనంతరం వారి వారి సొంత స్థలాలకు అంబులెన్స్‌లో తరలించాలని అధికారులను ఆదేశించారు. సొంత నిధులతో అంబులెన్స్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సైబరాబాద్ డీసీపీ శ్రీనివాస్ ప్రాచీన్ హాస్పిటల్‌కు చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు. ఒకేసారి ఆరుగురు విద్యార్థులు చెందడం పట్ల ఆయన తీవ్రంగా కలతచెందారు. శిరీష ట్రస్ట్ శివనగర్ చౌరస్తా పెద్దకంజర్లలో ఉండగా 70 మంది విద్యార్థులు ఒకటవ తరగతి నుండి పాలిటెక్నిక్, బీటెక్ వరకు చదివే పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులను మాత్రమే ట్రస్టులో చేర్చుకుంటారు. ఆంధ్రకు చెందిన కృష్ణంరాజు అనే వ్యక్తి తన కుమార్తె శిరీష పేరు మీద ట్రస్ట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం. వినాయక నిమజ్జనానికి వెళ్లి ఆరుగురు విద్యార్థులు మృతిచెందడంతో పటాన్ చెరు ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది.

**విద్యార్థుల మృతిపై రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు మృతిచెందడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**మంత్రి సీతక్క దిగ్భ్రాంతి**

సంగారెడ్డి జిల్లా పఠవన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జనం సందర్భంగా చెరువులోకి దిగి ఆరుగురు చిన్నారులు మృతిచెందిన ఘటనపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పండుగ వేళ ఆరుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకునేందుకు మంత్రి సీతక్క సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, చేపట్టిన సహాయక చర్యలు, బాధిత కుటుంబాలకు అందుతున్న సహాయం తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. అలాగే మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓఝాతో మంత్రి సీతక్క మాట్లాడారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం, పిల్లల భద్రతకు సంబంధించిన చర్యలను సమన్వయంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చిన్నారుల భద్రత విషయంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా నిమజ్జన కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో పిల్లలు ప్రమాదకరమైన నీటి వనరుల వద్దకు వెళ్లకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు.

# మేడిగడ్డ బ్యారేజీకి పోటెత్తిన వరద

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 16 :

మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బరాజ్ కు వరద నీరు భారీగా వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా బరాజ్ కు వరద పెరుగుతోంది. మంగళవారం 94,640 క్యూసెక్కుల ప్రవాహం రాగా బుధవారం 1.08,500 క్యూసెక్కులకు పెరిగింది. మొత్తం 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బరాజ్ గరిష్ట నీటి ప్రవాహం ఎత్తు రివర్ బెడ్ నుండి సముద్ర మట్టానికి 100 మీటర్లు కాగా, ప్రస్తుతం 90.50 మీటర్ల ఎత్తులో ఉందని భారీ నీటి పారుదల శాఖ ఈఈ సురేశ్ తెలిపారు.

# గజం భూమి ఎక్కువ ఉన్నా సరెండర్ చేస్తా

హైదరాబాద్, సెప్టెంబర్ 16 :

తాను ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న భూముల కన్నా గజం భూమి ఎక్కువ ఉన్నా ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తేల్చి చెప్పారు. అసెంబ్లీలో 22ఏపై బుధవారం జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టు ప్రస్తావించిన అంశంపై 'ఎక్స్' వేదికగా ఆమె స్పందించారు. అసెంబ్లీలో సీఎం ఎవరెవరి పేర్లు ప్రస్తావించి వారికి ఎక్కువ భూములు ఉన్నట్లు చెప్పారో వారందరిపై సీబీఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అయితే□ వారందరిపై సరైన విచారణ జరిపిస్తారన్న నమ్మకం తనకు లేదన్నారు. సీఎం చదివిన భూముల చిట్టాలో నిజాలు నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 'సీఎం ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించిన గుంట నక్క, కేసీఆర్ ఫాం హౌస్‌లో ఉండే సీఎం గూఢచారి సహా నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలి అని డిమాండ్ చేశారు. తాను ఎప్పటినుంచో చెప్తున్నట్టుగా గుంపు మేస్త్రీ - గుంటనక్క కలిసే ఉన్నారని మరోసారి స్పష్టం చేశారు. వారిద్దరూ కలిసే ఈ డ్రామాలు చేస్తున్నారని కవిత మండిపడ్డారు. నిబంధనలు అతిక్రమించి తనకు గజం భూమి ఎక్కువగా ఉన్నా, ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న భూమి కన్నా గజం అదనంగా ఉన్నట్టు తేలినా ఆ భూములు ప్రభుత్వానికి సరెండర్ చేస్తానని మరోసారి స్పష్టం చేస్తున్నానన్నారు.

# హైదరాబాద్‌ను నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం

మొదటిపేజీ తరువాయి

ప్రతినిధులకు వివరించారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సింగపూర్ వాణిజ్యపరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఇంధన వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి అగస్టిన్ లీ బృందం బుధవారం భేటీ అయింది. మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ అభివృద్ధి అంశాలను సింగపూర్ ప్రతినిధులకు సీఎం వివరించారు. హైదరాబాద్‌ను పర్యాటకంగానే కాక నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్న సీఎం ఇప్పటికే హార్వార్డ్, ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీల, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తమ ఆఫ్ షోర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు అంగీకరించినట్లు చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీని నెట్ జీరో సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతోపాటు, రాష్ట్ర అభివృద్ధికి ఆర్థికపరమైన సహకారం అందించాలని సీఎం ఆ ప్రతినిధులను కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అన్ని రకాలుగా ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. పెట్టుబడులపై సింగపూర్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సింగపూర్ ప్రతినిధులను ఫ్యూచర్ సిటీలో డిసెంబరులో నిర్వహించే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, కాన్సుల్‌జనరల్ విలియం చిక్, ఇతర సింగపూర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాత దరఖాస్తుల బదిలీకి అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 16 :

హౌసింగ్ బోర్డు చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ సొంతింటి పథకానికి సంబంధించి 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మరో వెసులుబాటు కల్పించినట్లు బోర్డు వైస్ చైర్మన్, కమిషనర్ వి.పి.గౌతమ్ తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాల్లో ఏదైనా ఒక నియోజకవర్గం కింద దరఖాస్తు చేసుకుని ప్రస్తుతం ఎల్‌బీ నగర్, గోషామహల్, ముషీరాబాద్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో నివసిస్తుంటే తమ పాత దరఖాస్తును ఈ నియోజకవర్గాలకు బదిలీ చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ పాత దరఖాస్తు వివరాలతో హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌లోని https://tghb.telangana.gov.in/curestatus లింక్ ద్వారా ఈనెల 20లోగా దరఖాస్తు బదిలీ కోసం అభ్యర్థించాలని గౌతమ్ సూచించారు. అభ్యర్థి ప్రస్తుతం నివసిస్తున్న అసెంబ్లీ నియోజకవర్గానికి మాత్రమే దరఖాస్తు బదిలీ జరుగుతుందని, ఈ బదిలీ నివాస ధ్రువీకరణతో పాటు ఇందిరమ్మ ఇండ్లు పథకానికి సంబంధించిన అన్ని అర్హతలు, నిబంధనల పరిశీలనకు లోబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం అభ్యర్థులు కొత్తగా లేదా ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పించరాదన్నారు. దరఖాస్తు బదిలీ చేయడం వల్ల ఇంటి కేటాయింపుపై ఎలాంటి హక్కు ఏర్పడదని, దరఖాస్తుల పరిశీలన, అర్హత నిర్ధారణ, నిర్దేశించిన కేటాయింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే అర్హులైన వారికి ఇళ్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు మధ్యవర్తులను ఆశ్రయించవద్దని, ఎవరికీ ఎలాంటి నగదు చెల్లించవద్దని గౌతమ్ కోరారు. అధికారిక సమాచారం తెలంగాణ హౌసింగ్ బోర్డు అధీకృత మార్గాల ద్వారా మాత్రమే తెలియజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు https://tghb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా తెలంగాణ హౌసింగ్ బోర్డు కాల్ సెంటర్ నంబర్ 04024603572ను సంప్రదించవచ్చునన్నారు.

# పటేల్ ధైర్యాన్ని స్మరించుకోవాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 :

భగత్ సింగ్, ఝాన్సీ లక్ష్మీబాయి పేర్లు వింటే యువతరం నరనరాల్లో దేశభక్తి ఉప్పొంగుతుంది.. అదే స్థాయిలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ త్యాగాన్ని, ధైర్యాన్ని కూడా భావితరాలు స్మరించుకోవాలి అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. నాడు పటేల్ తెగువ చూపకపోయి ఉంటే నేడు తెలంగాణ భారత యూనియన్‌లో ఉండేది కాదని స్పష్టం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన చారిత్రక ఫొటో ఎగ్జిబిషన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులతో కలిసి ప్రదర్శనను తిలకించిన ఆయన నిజాం నిరంకుశ పాలనపై సాగిన వీరోచిత పోరాట ఘట్టాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా రామచందర్ రావు మాట్లాడుతూ దేశమంతటికీ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే హైదరాబాద్ సంస్థానానికి మాత్రం దాదాపు పదమూడు నెలల తర్వాత 1948 సెప్టెంబరు 17న స్వేచ్ఛ లభించిందని గుర్తు చేశారు.




# యూపీఐ ఎండీఆర్ ఛార్జీలపై కేంద్రం స్పష్టత

- విదేశీ ఒత్తిళ్లు లేవని ఆర్థిక శాఖ వెల్లడి!
- స్వతంత్రంగా తీసుకున్న నిర్ణయమన్న కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16**

యూపీఐ లా వాదేవీలపై నేషనల్ పేమెంట్స్ కార్పొ రేషన్ ఆఫ్ ఇండియా మర్చంట్ డి స్కౌంట్ రేటును విధించడంపై ప్రతిప క్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించిం ది. ఇందులో ఎలాంటి విదేశీ ఒత్తిళ్లు లేవ ని.. తాము స్వతంత్రంగా తీసుకున్న నిర్ణ యమని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆర్థి కంగా నిలదొక్కుకోగలిగే.. అందరికీ అందు బాటులో ఉండే డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ను సృష్టించడమే ఈ కొత్త విధానం వెనుక ఉన్న లక్ష్యమని పేర్కొంది. స్వయం సమృద్ధి, సమ్మిళితమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అభివృద్ధి చేయడా నికే ఈ ఆలోచన చేసిన ట్లు తెలిపింది. రూ.2వేల్లోపు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలూ వర్తించబోవని, ఆపైబడిన నిర్దిష్ట లావాదేవీలకు మాత్రం 0.4 శాతం ఛార్జీ లు చెల్లించాల్సి ఉంటుందని ఎన్పీసీఐ స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



# కంటతడి పెట్టిన నిర్మలా సీతారామన్

- బెంగళూరులో ఎంఎస్ సుబ్బులక్ష్మి 110వ జయంతి వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర ఆర్థిక మంత్రి
- ప్రసంగం మధ్యలో భావోద్వేగానికి గురైన నిర్మలా సీతారామన్
- సుబ్బులక్ష్మి గాత్రం దైవిక అనుభూతి అన్న మంత్రి
- భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటిన మహనీయురాలిగా ప్రశంసలు

**బెంగళూరు, సెప్టెంబరు 16:**

భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి 110వ జయంతి వేడుకల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ భావోద్వేగానికి గుర య్యారు. బుధవారం బెంగళూరులో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె.. సుబ్బులక్ష్మిని స్మరించుకుంటూ ప్రసంగిస్తుండగా ఒక్కసారిగా గొంతు పూ డుకుపోయింది. కంటతడి పెట్టుకోవడంతో కార్యక్రమానికి హాజరైనవారు కూడా ఉద్వే గానికి లోనయ్యారు.

**సుబ్బులక్ష్మి సంగీత సేవలకు ప్రశంసలు**

కర్ణాటక సంగీతానికి ఎంఎస్ సుబ్బులక్ష్మి అందించిన సేవలను నిర్మలా సీతారామ న్ కొనియాడారు. ఆమె గాత్రం కేవలం సంగీతం కాదని.. దైవిక అనుభూతిని కలిగించే శక్తి అని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంగీత వైభవాన్ని ప్రపంచవ్యా ప్తంగా చాటడంలో సుబ్బులక్ష్మి పాత్ర చిర స్మరణీయమని అన్నారు.

**నిరాడంబర జీవితం గుర్తుచేసుకుని భావోద్వేగం**

సుబ్బులక్ష్మి ప్రతిభతో పాటు ఆమె ని రాడంబర జీవితాన్ని కూడా మంత్రి గుర్తుచేసుకున్నారు. ఆమె గొప్పతనాన్ని వివరిస్తున్న సమయంలో నిర్మలా సీతా రామన్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

# పాక్ కేంద్రంగా షాజాద్ భట్టి నెట్‌వర్క్.. ఉగ్ర సంస్థగా గుర్తింపు

- యూఏపీఏ కింద నిషేధిత ఉగ్ర సంస్థగా కేంద్రం ప్రకటన
- తొలి షెడ్యూల్‌లో 46వ సంస్థగా ఎస్‌బీఎన్ నమోదు
- ఆయుధాలు, పేలుడు పదార్థాలు, డ్రగ్స్ అక్రమ రవాణా
- యువత, స్థానిక నేరస్థులను ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నట్లు ఆరోపణ
- డిజిటల్ వేదికలపై విద్వేషపూరిత ప్రచారానికి పాల్పడుతున్నట్లు వెల్లడి
- ఇతర నిషేధిత సంస్థలతో కలిసి నిధుల సమీకరణకు పాల్పడుతున్నట్లు కేంద్రం పేర్కొంది

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 16:**

పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగి స్తున్న షాజాద్ భట్టి నెట్‌వర్క్ (ఎస్‌బీఎన్) ను కేంద్ర ప్రభుత్వం చట్టవిరుద్ధ కార్యకలా పాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. యూఏ పీఏలోని సెక్షన్ 35(1)(ఏ) ప్రకారం తొలి షెడ్యూల్‌లో ఎస్‌బీఎన్‌ను చేర్చుతూ కేంద్ర హోంశాఖ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో ఆ జాబితాలో ఎస్‌బీఎన్ 46వ సంస్థగా నమోదైంది.

**సరిహద్దు అక్రమ రవాణా**

షాజాద్ భట్టి నెట్‌వర్క్ సరిహద్దుల మీదుగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్ర వ్యాలను అక్రమంగా తరలిస్తున్నట్లు కేంద్రం పేర్కొంది. అమాయక యువత, స్థానిక నే రస్థులను ప్రలోభాలకు గురిచేసి ఉగ్రవాద కార్యకలాపాల్లోకి దింపుతున్నట్లు తెలిపింది. ఇతర నిషేధిత సంస్థలతో కలిసి దేశ వ్యతిరేక కార్యకలాపాలకు వనరులను సమీకరిస్తున్న ట్లు గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

**డిజిటల్ వేదికలపై విద్వేష ప్రచారం**

దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, మత సామర స్యానికి విఘాతం కలిగించేలా డిజిటల్ కమ్యూనికేషన్ వేదికల ద్వారా రెచ్చగొట్టే సందేశాలు, విద్వేషపూరిత కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నట్లు కేంద్రం ఆరోపించింది. ఎస్‌బీఎన్ సభ్యులపై యూఏపీఏతో పాటు భారతీయ న్యాయ సంహిత, ఆయుధాల చట్టం, పేలుడు పదార్థాల చట్టాలు, ఐటీ చట్టం తదితర చట్టాల కింద పలు కేసులు నమోదైనట్లు నోటిఫికేషన్ వెల్లడించింది.

# ఝీరాం వ్యాలీ కేసులో 10 మందికి మరణశిక్ష

- 2013 నాటి మావోయిస్టు దాడి కేసులో కీలక తీర్పు
- కాంగ్రెస్ పరివర్తన్ ర్యాలీపై దాడిలో 32 మంది మృతి
- ముద్దాయిలను దోషులుగా నిర్ధారించిన ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానం
- దాడి వెనుక నెట్‌వర్క్, కుట్రపై సాగిన దర్యాప్తు
- తదుపరి న్యాయపరమైన ప్రక్రియపై ఉత్కంఠ

**జగదల్‌పూర్, సెప్టెంబర్ 16:**

ఛత్తీస్‌గఢ్‌లోని ఝీరాం వ్యాలీ మావోయిస్టు దాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో 10 మందిని దోషులుగా నిర్ధారిస్తూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రత్యేక న్యాయస్థానం మరణశిక్ష విధించినట్లు సమాచారం. 2013లో జరిగిన ఈ దాడి దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. కాంగ్రెస్ నిర్వహించిన పరివర్తన్ ర్యాలీని లక్ష్యంగా చేసుకుని మావోయి స్టులు దాడికి పాల్పడ్డారు.

**32 మంది మృతి**

దాడి సమయంలో జరిగిన కాల్పులు, పేలుళ్ల తో ర్యాలీ బృందం తీవ్రంగా నష్టపోయింది. ఈ ఘటనలో రాజకీయ నాయకులు, కార్యకర్తలు, భద్రతా సిబ్బంది సహా మొత్తం 32 మంది ప్రాణాలు కోల్పోయారు. నాటి ఛత్తీస్‌గఢ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నందకుమార్ పటేల్, మాజీ కేంద్ర మంత్రి విద్యాచరణ్ శుక్లా, మాజీ ఎంపీ మహేంద్ర కర్మతో పాటు పలువురు ఈ దాడికి బలయ్యారు. దీంతో ఝీరాం వ్యాలీ ఘటన ఛత్తీస్‌గఢ్ రాజకీయ చరిత్రలో విషాదకర సంఘటనగా నిలిచింది.

**దీర్ఘకాలం సాగిన దర్యాప్తు**

దాడి అనంతరం కేసు దర్యాప్తు కొనసాగింది. ఘటన వెనుక ఉన్న మావోయిస్టు నెట్‌వర్క్, దాడి



ప్రణాళిక, పాల్గొన్న వ్యక్తులు, వారికి సంబంధిం చిన ఆధారాలను దర్యాప్తు సంస్థలు పరిశీలించా యి. నిందితులపై అభియోగాలు నమోదు చేసి న్యాయస్థానంలో విచారణ చేపట్టారు. దర్యాప్తు లో సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలా లు, ఇతర అంశాలను పరిశీలించిన అనంతరం కోర్టు తీర్పు వెలువరించింది.

**తదుపరి న్యాయ ప్రక్రియ కీలకం**

తాజా తీర్పులో 10 మందిని దోషులుగా నిర్ధా రించి మరణశిక్ష విధించడం కేసులో కీలక మలుపుగా మారింది. అయితే మరణశిక్షకు సం బంధించిన తదుపరి న్యాయపరమైన ప్రక్రియ కొనసాగాల్సి ఉంటుంది. దోషులకు ఉన్న అప్పీల్ హక్కులు, పైస్థాయి న్యాయస్థానాల్లో జరిగే విచారణ వంటి అంశాలు తదుపరి పరిణామా లను నిర్ణయించనున్నాయి. న్యాయపరమైన ప్ర క్రియ పూర్తయ్యే వరకు తీర్పుకు సంబంధించిన తదుపరి దశలు కొనసాగుతాయి.

# శ్రీదేవి చెన్నై ఆస్తిపై సుప్రీంకోర్టు ఆదేశాలు

- 4.77 ఎకరాల స్థలంపై దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదం
- శ్రీదేవి కుటుంబానికి వ్యతిరేకంగా ముదలియార్ కుటుంబ వారసుల పిటిషన్
- మద్రాస్ హైకోర్టు తీర్పును సవాల్ చేసిన శివగామి
- ఆస్తిపై యథాతథ స్థితి కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశం
- మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారానికి ఇరువర్గాలు ప్రయత్నించాలని సూచన
- తదుపరి విచారణ డిసెంబర్ 18కు వాయిదా

**చెన్నై, సెప్టెంబరు 16:**



దివంగత నటి శ్రీదేవికి సంబంధించిన చెన్నై ఆస్తి వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని 4.77 ఎకరాల స్థలంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. తదుపరి విచారణ వరకు ప్రస్తుత పరిస్థితిని యథాతథం గా కొనసాగించాలని ఆదేశించింది. ఇరువర్గాలు సామరస్యపూర్వకంగా సమస్యను పరిష్కరించు కునే అవకాశాన్ని పరిశీలించాలని సూచించింది.

**1988లో కొనుగోలు**

శ్రీదేవి 1988లో ముదలియార్ కుటుంబం నుంచి ఈ స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆమె మరణం తర్వాత 2023లో కుటుంబ సభ్యులు ఆస్తి మార్పిడి కోసం దరఖాస్తు చేసుకున్నారు. అదే సమయంలో ముదలియార్ రెండో భార్య పి ల్లలైన ఎం.సి. శివగామి, ఆమె సోదరుడు ఆస్తిలో తమకూ హక్కు ఉందంటూ చెంగల్పట్టు కోర్టులో సివిల్ కేసు వేశారు.

**హైకోర్టు తీర్పుపై అప్పీల్**

ఈ కేసును కొట్టివేయాలని శ్రీదేవి భర్త బోనీ కపూర్, కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ముద లియార్ మొదటి భార్య జీవించి ఉండగానే రెండో వివాహం చేసుకున్నందున, రెండో భార్య పిల్లలకు ఆస్తిపై చట్టపరమైన వారసత్వ హక్కు ఉండదని వారి తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలను అంగీకరించిన హైకోర్టు, శివగామి దాఖలు చేసిన సివిల్ కేసును కొట్టివేసింది.

హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ శివగామి సు ప్రీంకోర్టును ఆశ్రయించారు. కేసు ప్రాథమిక దశలో ఉండగానే హైకోర్టు లోతైన విచారణ జరి పిందని ఆమె తరపు న్యాయవాది వాదించారు. మరోవైపు కపూర్ కుటుంబం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ.. 1988లో జరిగిన కొనుగోలుపై ఇన్నేళ్ల తర్వాత వివాదం లే వనెత్తడాన్ని ప్రస్తావించారు. పిటిషనర్లు 1995, 1999లోనే మేజర్లుగా మారినప్పటికీ, చాలా కాలం తర్వాత కేసు వేశారని పేర్కొన్నారు.

**మధ్యవర్తిత్వానికి అవకాశం**

ఇరువర్గాల వాదనలు విన్న సుప్రీంకోర్టు, మధ్య వర్తిత్వం ద్వారా పరిష్కారానికి అవకాశం కల్పిం చాలని నిర్ణయించింది. ఇందుకోసం విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తిని మధ్యవర్తిగా నియమి స్తామని తెలిపింది. అప్పటివరకు ఆస్తిపై ఎలాంటి మార్పులు చేయకుండా యథాతథ స్థితి కొనసా గించాలని ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 18కు వాయిదా వేసింది.

# మక్కా సమీపంలో హూతీల దాడులు

- డ్రోన్‌ను అడ్డుకున్న సౌదీ వైమానిక రక్షణ బలగాలు
- నిషేధిత గగనతలంలోకి ప్రవేశించకముందే కూల్చివేత
- ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన భారత్
- మక్కా, జెడ్డా, తైఫ్‌లో భద్రతా అప్రమత్తత
- మతపరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకోలేదన్న హూతీలు
- పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి భారత్ పిలుపు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16:**

సౌదీ అరేబియాలోని పవిత్ర నగరం మక్కా సమీపంలో హూతీ డ్రోన్‌ను అడ్డుకున్న ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సౌదీ భూభాగంపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ.. పశ్చిమాసియాలో వీలైనంత త్వరగా శాంతి, స్థిరత్వం నెలకొనాలని ఆకాంక్షించింది. ప్రపం చవ్యాప్తంగా ముస్లింలకు మక్కాకు ఉన్న ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఘటనపై ఆందోళన వ్యక్తం చేసింది.

**మక్కా దిశగా డ్రోన్**

సెప్టెంబర్ 15న మక్కాకు దక్షిణంగా హూతీలు ప్రయోగించిన డ్రోన్‌ను సౌదీ రాయల్ ఎయిర్ డిఫెన్స్ బలగాలు అడ్డుకుని ధ్వంసం చేశాయి. మక్కా నిషేధిత గగనతలంలోకి ప్రవేశించక ముందే డ్రోన్‌ను కూల్చివేసినట్లు సౌదీ నేతృ త్వంలోని సంకీర్ణ బలగాల అధికార ప్రతినిధి తెలిపారు. ఘటన నేపథ్యంలో మక్కా, జెడ్డా, తైఫ్ ప్రాంతాల్లో భద్రతా అప్రమత్తతను పెంచారు.

**మతపరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకోలేదన్న హూతీలు**

మక్కా లేదా ఇతర మతపరమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకున్నట్లు వచ్చిన ఆరోపణలను హూతీలు ఖండించారు. సౌదీలోని ఇతర లక్ష్యాల పై తమ దాడులు కొనసాగుతున్నాయని, మతప రమైన ప్రదేశాలను లక్ష్యంగా చేసుకోవడం తమ ఉద్దేశం కాదని పేర్కొన్నారు. అయితే మక్కాకు



సమీపంలో డ్రోన్‌ను అడ్డుకోవడం, భద్రతను పెంచడం ఆందోళనకు కారణమైంది.

**భారత్ ఆందోళన**

పశ్చిమాసియాలో ఇప్పటికే ఉద్రిక్త పరిస్థి తులు కొనసాగుతున్న నేపథ్యంలో మక్కా సమీప ఘటనపై భారత్ స్పందించింది. సౌదీ భూభాగంపై దాడులను ఖండించిన విదేశాంగ శాఖ.. పౌరుల ప్రాణాలు, మౌలిక వసతులకు ముప్పు కలిగించే చర్యలను వ్యతిరేకించింది. ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది.

# అనంత్ నాగ్‌కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

- 2024 సంవత్సరానికి పురస్కారానికి ఎంపికైన ప్రముఖ నటుడు
- కన్నడ సినీ రంగంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న నటనా ప్రస్థానం
- కథానాయకుడిగా, సహాయ నటుడిగా విభిన్న పాత్రల్లో గుర్తింపు
- తెలుగు సహా ఇతర భాషల చిత్రాల్లోనూ నటించిన అనంత్ నాగ్
- సహజ నటన, పాత్రకు అనుగుణంగా మారే నైపుణ్యంతో ప్రత్యేక ముద్ర
- సుదీర్ఘ సినీ సేవలకు ప్రతిష్ఠాత్మక గౌరవం

**న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 16:**

ప్రముఖ నటుడు అనంత్ నాగ్‌కు ప్రతిష్ఠాత్మక దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు దక్కింది. 2024 సంవత్సరానికి గాను ఆయనను ఈ పురస్కారా నికి ఎంపిక చేసినట్లు సమాచారం. భారతీయ సినీ రంగానికి అందించిన విశిష్ట సేవలు, నటుడిగా చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. దశాబ్దాలుగా సినీ రంగంలో కొన సాగుతున్న అనంత్ నాగ్ సహజ నటనతో ప్రేక్ష కుల అభిమానాన్ని సంపాదించుకున్నారు.

**కన్నడ చిత్ర పరిశ్రమలో ప్రత్యేక ముద్ర**

అనంత్ నాగ్ ప్రధానంగా కన్నడ చిత్ర పరిశ్రమ లో తనదైన ముద్ర వేశారు. కథానాయకుడిగా, సహాయ నటుడిగా, విభిన్న పాత్రల్లో నటిస్తూ



ప్రేక్షకులను మెప్పించారు. సినిమాలతో పాటు రంగస్థలం, సాంస్కృతిక రంగాల్లోనూ ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. సాధారణ పాత్రలను సైతం తన నటనా ప్రతిభతో గుర్తుండిపోయేలా చేయడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది.

**ఇతర భాషల్లోనూ నటన**

కన్నడ సినిమాతో పాటు ఇతర భాషల చిత్రాల్లో నూ అనంత్ నాగ్ నటించారు. తెలుగు ప్రేక్షకు లకు కూడా ఆయన సుపరిచితమే. సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో భాగమై, విభిన్న తరాల ప్రేక్షకులతో అనుబంధా న్ని ఏర్పరచుకున్నారు. నటనలో సహజత్వం, సంభాషణల్లో స్పష్టత, పాత్రకు అనుగుణంగా తనను తాను మార్చుకునే నైపుణ్యం ఆయనకు ప్రత్యేకమైన గుర్తింపును తీసుకొచ్చాయి.

**ప్రతిష్ఠాత్మక గౌరవం**

దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు భారతీయ చలనచి త్ర రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పురస్కా రాల్లో ఒకటిగా పరిగణిస్తారు. భారతీయ సినిమా అభివృద్ధికి విశేషంగా సేవలందించిన ప్రముఖు లకు ఈ గౌరవాన్ని అందిస్తారు. అనంత్ నాగ్‌కు ఈ పురస్కారం లభించడం ఆయన సుదీర్ఘ సినీ ప్రస్థానానికి మరో గుర్తింపుగా నిలిచింది. ఆయన అభిమానులు, సినీ ప్రముఖులు అభినందనలు తెలియజేస్తున్నారు.





# కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- మేడిపల్లి డివిజన్ అధ్యక్షులు తుంగతుర్తి రవి
- నూతనంగా నియమితులైన కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యులకు తుంగతుర్తి రవి శుభాకాంక్షలు

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాన్ని నియమించారు. ఈ నియామకాల్లో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పప్పుల అంజిరెడ్డి, డీసీసీ సెక్రటరీలుగా పాశం బుచ్చి యాదవ్, బండారి రవీందర్ నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పప్పుల అంజిరెడ్డి, పాశం బుచ్చి యాదవ్, బండారి రవీందర్ లకు మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. నూతనంగా నియమితులైన నాయకులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని తుంగతుర్తి రవి కోరారు. పార్టీ అధిష్ఠానం, డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షిస్తూ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో డీసీసీ ఉపాధ్యక్షులు మహేష్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి జలెందర్ రెడ్డి, లీగల్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ కార్యవర్గ సభ్యులు, మహిళా అధ్యక్షురాలు దుర్గ, మహిళా నాయకులు, సీనియర్ నాయకులు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పప్పుల అంజిరెడ్డి నియామకం

- నియామక పత్రాన్ని అందించిన జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



**మేడ్చల్, రాజముద్ర న్యూస్:** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పప్పుల అంజిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసే దిశగా నూతన బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పప్పుల అంజిరెడ్డికి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్టం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

**పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి**

ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పప్పుల అంజిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, పార్టీ సంస్థాగత వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తానని వెల్లడించారు. పార్టీ నాయకత్వం నిర్దేశించే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

**పలువురి అభినందనలు**

పప్పుల అంజిరెడ్డి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. పార్టీ అభివృద్ధికి అంజిరెడ్డి అందించే సేవలు మరింత బలోపేతానికి దోహదపడాలని వారు పేర్కొన్నారు.

**అమర్ సింగ్, శివకుమార్ గౌడ్‌లకు కృతజ్ఞతలు**

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన పప్పుల అంజిరెడ్డి తన నియామకానికి సహకరించిన మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తల సహకారంతో నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

# వినాయక వేడుకల్లో మహిళలకు ఆరోగ్య కానుక

- గేమ్స్ విజేతలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు
- గ్లోబ్ పాలి క్లినిక్ అండ్ దయాగ్నస్టిక్స్ సెంటర్ ఎండీ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఆరోగ్య సేవలు
- మొదటి విజేతకు రూ.4 వేల విలువైన పూర్తి ఆరోగ్య పరీక్ష
- రెండో విజేతకు ఉచిత షుగర్ పరీక్ష



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** వినాయక చవితి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవలకు వేదికగా నిలుస్తున్నాయి. పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని మారుతీ నగర్ పార్కులో నిర్వహిస్తున్న గణపతి ఉత్సవాల్లో మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గ్లోబ్ పాలి క్లినిక్ అండ్ దయాగ్నస్టిక్స్ సెంటర్ ముందుకు వచ్చింది. గ్లోబ్ పాలి క్లినిక్ అండ్ దయాగ్నస్టిక్స్ సెంటర్ ఎండీ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో గేమ్స్ విజేతలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు అందించనున్నట్లు ప్రకటించారు. మారుతీనగర్ పార్కులో గణపతి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ మహిళలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో విజయం సాధించే ఇద్దరు మహిళలకు ప్రతిరోజూ ఉచిత ఆరోగ్య పరీక్షలు అందించనున్నట్లు గ్లోబ్ పాలి క్లినిక్ అండ్ దయాగ్నస్టిక్స్ సెంటర్ ఎండీ రాజ్ కుమార్ తెలిపారు. మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు, తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు.

**మొదటి విజేతకు రూ.4 వేల విలువైన పూర్తి ఆరోగ్య పరీక్ష**

ప్రతిరోజూ నిర్వహించే గేమ్స్‌లో మొదటి స్థానంలో నిలిచే మహిళకు సుమారు రూ.4 వేల విలువైన పూర్తి ఆరోగ్య పరీక్షను ఉచితంగా అందించనున్నట్లు ఎండీ రాజ్ కుమార్ తెలిపారు. ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడం ద్వారా తగిన వైద్య సలహాలు తీసుకునే అవకాశం ఉంటుందని, మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

**రెండో విజేతకు ఉచిత షుగర్ పరీక్ష**

అదే విధంగా గేమ్స్‌లో రెండో స్థానంలో నిలిచే మహిళకు ఉచితంగా షుగర్ పరీక్షతో పాటు రక్తపరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. రోజువారీ కుటుంబ బాధ్యతల్లో మహిళలు తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా ఉండే పరిస్థితులు ఉంటాయని, అందువల్ల ఉత్సవాల సందర్భంగా వారికి ఆరోగ్య పరీక్షల రూపంలో ఉపయోగకరమైన కానుక అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాజ్ కుమార్ పేర్కొన్నారు.

**ఆరోగ్యంపై అవగాహన పెంచడమే లక్ష్యం**

మహిళలు తమ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని గ్లోబ్ పాలి క్లినిక్ అండ్ దయాగ్నస్టిక్స్ సెంటర్ ఎండీ రాజ్ కుమార్ సూచించారు. శరీరంలో ఏర్పడే కొన్ని ఆరోగ్య సమస్యలు ప్రారంభ దశలో పెద్దగా లక్షణాలు కనిపించకుండా ఉండే అవకాశం ఉందని, అందువల్ల అవసరమైన సమయంలో వైద్యుల సూచన మేరకు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. వినాయక ఉత్సవాలు ప్రజలను ఒకచోటకు చేర్చే గొప్ప వేదికగా ఉన్నందున, ఈ సందర్భంగా ప్రజలకు ఉపయోగపడే ఆరోగ్య కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా మరింత అవగాహన కల్పించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు అందించడం ద్వారా వారు తమ ఆరోగ్య పరిస్థితిపై అవగాహన పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.

**ప్రతి ప్రాంతంలో ఆరోగ్య సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

పండుగల సందర్భంగా కేవలం వినోద కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే ఆరోగ్య కార్యక్రమాలను కూడా నిర్వహించాలని రాజ్ కుమార్ కోరారు. ప్రతి ప్రాంతంలో జరిగే ఉత్సవాల్లో వైద్యులు, ఆరోగ్య సంస్థలు ముందుకు వచ్చి ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. మహిళల ఆరోగ్యం పట్ల కుటుంబ సభ్యులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన సమయంలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంచడం ద్వారా అనేక సమస్యలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.మారుతీనగర్ నూతన కమిటీ సభ్యుల హర్షం మారుతీనగర్ పార్కులో జరుగుతున్న గణపతి ఉత్సవాల్లో మహిళల కోసం నిర్వహిస్తున్న గేమ్స్‌కు మంచి స్పందన లభిస్తోంది. గేమ్స్ విజేతలకు ఆరోగ్య పరీక్షలను ఉచితంగా అందిస్తామని ప్రకటించడం పట్ల మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఆటల్లో పాల్గొని విజయం సాధించడంతో పాటు ఆరోగ్య పరీక్షల ప్రయోజనం పొందే అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మారుతీనగర్ నూతన కమిటీ సభ్యులు, భక్తులు గ్లోబ్ పాలి క్లినిక్ అండ్ దయాగ్నస్టిక్స్ సెంటర్ ఎండీ రాజ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమానికి సహకరించడం అభినందనీయమని పేర్కొన్నారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పండుగలకు మరింత ప్రత్యేకత వస్తుందని అన్నారు. మారుతీనగర్‌లో ప్రారంభమైన ఈ ఆరోగ్య సేవా కార్యక్రమం ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# సాగర్ జలాలతో చెరువులు నింపి రైతులను ఆదుకోవాలి

బీజేపీ డిమాండ్



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని చెరువులు, కుంటలను సాగర్ జలాలతో నింపాలని కోరుతూ ఎన్ ఎస్ పి ఏఈ కి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ, ఎల్ నినో సాకుతో సాగర్ జలాలను విడుదల చేయకుండా ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. మండలంలోని అన్ని కుంటలు, చెరువులను తక్షణమే నీటితో నింపి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా తెలంగాణ రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫసల్ బీమా యోజనను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఉన్న రైతాంగ సమస్యలపై భవిష్యత్తులో ఆందోళనకు సిద్ధం కావాలని బీజేపీ నాయకత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు అనంత ఉపేందర్ గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజీ రామకృష్ణ, బీజేపీ నాయకులు పురాణం దివాకర్, పిట్టల సూరిబాబు, ఎస్కే షరీఫుద్దీన్, కిసాన్ మోర్చా మండల కన్వీనర్ సూరేపల్లి జ్ఞానరత్నం, గెల్లా చక్రపాణి, తుపాకుల సంజన, కొండ హర్షవర్ధన్, ధారావత వీరు నాయక్, సోషల్ మీడియా ఇంచార్జ్ కే. గోపి తదితరులు పాల్గొన్నారు.

# పద్మావతి ప్లాజాలో అన్నసమారాధన

కూకట్ పల్లి పద్మావతి ప్లాజాలో కొలువుదీరిన 'ప్లాజా కా రాజా'



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** వినాయక నవరాత్రుల సందర్భంగా కూకట్‌పల్లి పద్మావతి ప్లాజాలో 'ప్లాజా కా రాజా' పేరుతో కొలువుదీరిన గణనాథుడి సన్నిధిలో బుధవారం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పద్మావతి ప్లాజా గ్రౌండ్ ఫ్లోర్‌లో శివకృష్ణ–న్యూ వెంకటేశ్వర మొబైల్స్, రాఘవ–రవిచంద్ర మొబైల్స్, భాస్కర్–భాస్కర్ మొబైల్స్, వెంకట్‌రెడ్డి–ఏ.జె. మొబైల్స్, ప్రసాద్–ప్రసాద్ మొబైల్ ఫిక్సర్, రాజేష్–బాంబే డైయింగ్ వారి సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికులు, వ్యాపారులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో నిర్వాహకులు, వ్యాపారులు పాల్గొని భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భక్తులు, స్థానిక ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించిన చెవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్



**చెవెళ్ల, రాజముద్ర న్యూస్:** చెవెళ్ల జోన్ డిసిపి , ఐపిఎస్ యోగేష్ గౌతమ్ బుధవారం చెవెళ్ల ఎస్‌హెచ్‌ఓతో కలిసి చెవెళ్ల గుండాన్ని సందర్శించి, జరగబోయే గణేశ్ విగ్రహ నిమజ్జనానికి సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా డిసిపి గుండం, అనుసంధాన రహదారులు, పార్కింగ్ స్థలాలు, బారికేడింగ్ పాయింట్లు, నిమజ్జన ప్రదేశాలను పరిశీలించారు. నిమజ్జనం సజావుగా, శాంతియుతంగా జరిగేలా శాంతిభద్రతల నిర్వహణ, ట్రాఫిక్ మళ్లింపు, జనసమూహ నియంత్రణ, పోలీసు సిబ్బంది మోహరింపు, బారికేడింగ్, లైటింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇతర శాఖలతో సమన్వయంతో చేపడుతున్న కార్యాచరణ ప్రణాళిక, ముందుజాగ్రత్త చర్యల గురించి చెవెళ్ల ఎస్‌హెచ్‌ఓ డిసిపికి వివరించారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని డిసిపి ఆదేశించారు. నిమజ్జనం ప్రశాంతంగా జరిగేందుకు నిర్వాహకులు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, పోలీసులకు పూర్తిగా సహకరించాలని అధికారులు సూచించారు.

# డిజిటల్ క్రాప్ సర్వే పరిశీలించిన ఏవో భాను శ్రీ



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామంలో క్షేత్ర స్థాయిలో సర్వేయర్లు నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను ఏవో భానుశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్లకు రైతులకు పలు కీలక సలహాలు,సూచనలు చేశారు. సర్వేయర్లకు సూచనలు: సర్వే నంబర్ల వారీగా పంట వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా అత్యంత కచ్చితంగా నమోదు చేయాలి. సర్వేయర్లు నమోదు చేసే ఈ వివరాలనే భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు ప్రామాణికంగా తీసుకుంటారు కాబట్టి, ఎక్కడా తప్పులు జరగకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలి అని తెలిపారు, రైతులకు సూచనలు: డిజిటల్ క్రాప్ బుకింగ్ ఆన్‌లైన్‌లో నిర్వహించడానికి రెవెన్యూ గ్రామానికి ఒక సర్వేయర్‌ను ప్రత్యేకంగా నియమించడం జరిగింది. రైతులు తమ గ్రామ సర్వేయర్‌కు అందుబాటులో ఉండి, తమ సర్వే నంబర్ల వారీగా సాగు చేస్తున్న పంట వివరాలను పంట రకాన్ని సరిగ్గా నమోదు చేసుకోవాలని సూచడమైనది. ఈకార్యక్రమంలో ఏఈఓ బబిత,సర్వేయర్ కేంగర్ల శ్రీనివాస్ , రైతులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన తాసిల్దార్ ఉమలత



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం అన్నారం గ్రామం రైతు వేదికలో బుధవారం రోజున కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు తాసిల్దార్ ఉమలత, ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు, మండలంలోని అన్నారం గ్రామానికి ఆరు చెక్కులు, గొడుగు మర్రి తండా ఒకటి, మద్దికుంట రెండు, స్కూల్ తండా ఒకటి, బట్టు తాండ ఒకటి చెక్కులు పంపిణీ చేశారు, ఈ చెక్కులు పేదవారికి గొప్ప వరం లాంటిదని, ప్రతి లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఆర్ ఐ, ఉప సర్పంచ్ లు, పాలకవర్గ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు పాతర.. ముడుపుల జాతర..?

- మూసాపేట్ సర్కిల్ పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు..!
- అనుమతి రెండు అంతస్తులకే.. అక్రమంగా మరో మూడు..!



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని మూసాపేట్ సర్కిల్ భవానీ నగర్‌లో నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అధికారుల నిఘా వైఫల్యమో లేక చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న తీరో తెలియదు గానీ, భవన నిర్మాణదారులు బరితెగించి నిబంధనలకు పాతర వేస్తున్నారు. కేవలం స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తులకు మాత్రమే అనుమతులు తీసుకుని, క్షేత్రస్థాయిలో ఏకంగా అదనంగా మరో మూడు అంతస్తులు అక్రమంగా నిర్మిస్తూ నిబంధనలను తుంగలో తొక్కారు. కనీస నిబంధనల ప్రకారం చుట్టూ వదలాల్సిన సెట్‌బ్యాక్‌లను సైతం ఏమాత్రం పట్టించుకోకుండా, పక్కనున్న భవనాలకు ఆనిస్తూ ప్రమాదకర రీతిలో నిర్మాణం కొనసాగిస్తున్నారు. కంటిముందే ఇంత భారీ ఎత్తున అక్రమ నిర్మాణం శరవేగంగా సాగుతున్నా, స్థానిక మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి మాత్రం ఇది కనిపించకపోవడం వెనుక ఆంతర్యమేమిటని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీగా చేతులు మారిన ముడుపుల వల్లే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్న ఈ అక్రమ అంతస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులైన సిబ్బందిపై చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమంలో విలేకరుల పాత్ర కీలకం

**విలేకరులకు బుల్లెట్ ట్రైన్ జ్ఞాపికలు అందజేసిన అఖిలపక్ష జేఏసీ నాయకులు బూర మల్సూర్ గౌడ్**



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించాలనే లక్ష్యంతో అఖిలపక్ష జేఏసీ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉద్యమానికి ప్రజలతో పాటు విలేకరులు అందిస్తున్న సహకారం, చేస్తున్న సేవలు అభినందనీయమని అఖిలపక్ష జేఏసీ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి జిల్లా నాయకులు బూర మల్సూర్ గౌడ్ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ నాయకులు కలిసి సూర్యాపేటలో పనిచేస్తున్న విలేకరులందరికీ బుల్లెట్ ట్రైన్ జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా బూర మల్సూర్ గౌడ్ మాట్లాడుతూ.. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ రావాలనే డిమాండ్‌తో ప్రారంభమైన ఉద్యమం ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకోవడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఉద్యమం ప్రారంభం నుంచి విలేకరులు నిరంతరం వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ అవసరాన్ని ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలు, ఉద్యమాలపై వార్తలను నిరంతరం ప్రచురిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విలేకరుల సేవలను గుర్తించి ఈ జ్ఞాపికలను అందజేస్తున్నట్లు చెప్పారు.సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ ఉద్యమంలో ప్రజలు, వ్యాపారులు, వివిధ సంఘాలు, కార్మికులు,యువతతో పాటు మీడియా ప్రతినిధుల సహకారం కూడా ఎంతో అవసరమని బూర మల్సూర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష జేఏసీ బుల్లెట్ ట్రైన్ సాధన సమితి నాయకులు, ధర్మార్జున్ ,భూపతి రాములు, పెద్దిరెడ్డి రాజా, వీరేందర్ , చల్లమల్ల నరసింహ, బూర వెంకటేశ్వర్లు, కృష్ణ ,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, విలేకరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నిరంతర కృషి





- కార్యదర్శి బండారి రవీందర్
- మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బండారి రవీందర్ నియామకం
- నియామక పత్రం అందజేసిన జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి చేస్తానని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యదర్శిగా నియమితులైన బండారి రవీందర్ తెలిపారు. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బండారి రవీందర్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బండారి రవీందర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. బండారి రవీందర్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంపై పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. తన నియామకానికి సహకరించిన మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్‌లకు బండారి రవీందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకుల సహకారంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

## మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా సుభాష్ నాయక్

- సుభాష్ నాయక్ కు నియామక పత్రం అందించిన తోటకూర వజ్రేష్ యాదవ్
- పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా
- పార్టీ అధిష్టానానికి, నాయకులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు
- మేడిపల్లి డివిజన్ జనరల్ సెక్రెటరీ కె. సుభాష్ నాయక్



**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా సుభాష్ నాయక్ నూతనంగా నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సుభాష్ నాయక్ కు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని తెలుపుతూ పార్టీ అధిష్టానానికి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని సుభాష్ నాయక్ అన్నారు.

## సమిష్టి కృషితోనే కాలనీ అభివృద్ధి సాధ్యం



- నూతన అధ్యక్షులు ఏవి రమణారెడ్డి
- విహారికా రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక
- కాలనీ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తాం

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** విహారికా కాలనీలో విహారికా రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మేడిపల్లి మాజీ ఉప సర్పంచ్ బండారి రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏ.వి. రమణా రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె. మనోజ్ ప్రదీప్, కోశాధికారిగా గుండా యాదగిరి గౌడ్, ఉపాధ్యక్షుడిగా సతీష్, సంయుక్త కార్యదర్శిగా సురేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో విహారికా కాలనీ మాజీ అధ్యక్షుడు సుధాకర్, మాజీ ప్రధాన కార్యదర్శి పుట్ట యాదగిరి రెడ్డితో పాటు ఆర్. వెంకట్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, నరేష్, పరమేష్, నరసింహ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి కాలనీ వాసులు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదలతో పాటు నివాసితుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. కాలనీ వాసుల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

## ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- ప్రాణవాయువును అందించే చెట్లు, మానవాళి మనుగడకు ఎంతో అవసరం...
- పర్వేద సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేందర్ గౌడ్



**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** ప్రాణవాయువును అందించే చెట్లు, మొక్కలు మానవాళి జీవన మనుగడకు ఎంతో అవసరమని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్వేద గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేందర్ గౌడ్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం శంకర్ పల్లి మండలంలోని పర్వేద గ్రామంలో రాముని గుడి, పోచమ్మ గుడి వద్ద దైవవృక్షాలు, పూల మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ ప్రోత్సాహంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ గౌడ్ ప్రత్యేకంగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేందర్ గౌడ్ మాట్లాడుతూ....ప్రకృతిని పరిరక్షించాలనే సంకల్పంతో గ్రామాల్లోని ఆలయాల వద్ద మొక్కలు నాటుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఇప్పటికే గుబ్బడి పత్తేపురం, ఎల్లకొండ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించి, తాజాగా పర్వేద గ్రామంలో కూడా ఆలయాల వద్ద దైవవృక్షాలు, పూల మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యతను కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్న సర్పంచ్ సురేందర్ గౌడ్, గ్రామ ప్రజలను మొక్కలు నాటే కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షులు నరేశ్ కుమార్ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధికి సర్పంచ్ సురేందర్ గౌడ్ మానవతా దృక్పథంతో సేవలు అందిస్తున్నారని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమానికి సహకరించి స్వయంగా పాల్గొన్న సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే స్వర్గీయ సుగుణ జ్ఞాపకార్థం ఆమె భర్త కందివనం నర్సింహారెడ్డి మొక్కలు సమకూర్చడంలో సహకరించి, సేవా ఫౌండేషన్ శ్రేయోభిలాషిగా పాల్గొన్నందుకు నరేశ్ కుమార్ అయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ పెద్దలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# కొచ్చి వేదికగా అక్టోబర్‌లో మెగా ఆక్షన్ నిర్వహణ..

## డబ్ల్యూపీఎల్ 2027 తేదీలు ఖరారు



మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ నిర్వహణకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్ మ్యాచ్‌లను 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త సీజన్ కోసం ఆటగాళ్ల మినీ వేలాన్ని ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరంలో జరుపుతారు. అయితే ఈ టోర్నీ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే వేదికల వివరాలను మాత్రం బీసీసీఐ ప్రస్తుతానికి వెల్లడించలేదు. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా అవతరించిన డబ్ల్యూపీఎల్, సరికొత్త ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తోందని బోర్డు తన అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇండియా అంతర్జాతీయ స్టార్లతో పాటు వంర్ధమాన క్రీడాకారిణులు తమ సత్తా చాటేందుకు ఈ లీగ్ గొప్ప వేదికగా నిలిచింది.రాబోయే సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జట్ల నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి బీసీసీఐ సెప్టెంబర్ 28ని ఆఖరి గడువుగా నిర్ణయించింది. ఈ గడువు లోగా ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది. రాబోయే సీజన్‌కు సరిపడే అత్యుత్తమ కాంబినేషన్‌లను ఎంపిక చేసుకోవడానికి జట్లకు ఇది మంచి అవకాశం. 2026 ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంచలన ఆటతీరుతో రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సారథ్యంలో బరిలోకి దిగిన ఆర్సీబీ, అద్భుత ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆ సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలలో విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జరగబోయే ఐదో సీజన్‌లోనూ విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఆర్సీబీ బృందం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు తగిన కసరత్తు ముమ్మరం చేస్తోంది ఆ టీమ్ మేనేజ్మెంట్. 2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెరో రెండుసార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. కొచ్చిలో జరిగే వేలం తర్వాత ఐదు ఫ్రాంచైజీలు కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనున్నాయని తెలుస్తోంది. ఇక మిగతా జట్లు కూడా విజేతగా నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.

# ఆసియా గేమ్స్‌లో టీమ్ఇండియాకు విప్రజ్ నిగమ్ ఎంపిక

ఒక ఆటగాడి గాయం కారణంగా ఇంకో ఆటగాడికి జట్టులో చోటు దక్కడం ఏ ఆటలోనైనా మామూలుగా జరిగేదే. తాజాగా టీమ్ఇండియా జాతీయ జట్టులోనూ అదే జరిగింది. అయితే ఈసారి జట్టులో చోటు దక్కించుకోనున్న ప్లేయర్?కు మాత్రం ఇది అరంగేట్రం కానుండడం విశేషం. గతేడాది ఐపీఎల్?లో టోర్నమెంట్?లో రాణించిన 22ఏళ్ల దిల్లీ క్యాపిటల్స్ బౌలర్?కు ఆసియా గేమ్స్?లో ఆడే అవకాశం దక్కినట్లు తెలుస్తోంది. మరో మూడు రోజుల్లో ఆసియా గేమ్స ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమ్ఇండియాకు రీసెంట్?గా ఎదురుదెబ్బ తగిలింది. దిల్లీ వేదికగా ఇటీవల అఫ్గానిస్థాన్?తో జరిగిన తొలి టీ20 మ్యాచ్?లో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి 'సైడ్ స్ట్రెయిన్' (పక్కటెముకల వద్ద కండరాల గాయం)కు గురయ్యాడు. దీంతో అతడు ఈ సిరీస్?లో మిగిలిన మ్యాచ్?లకు దూరమయ్యాడు. అయితే ఈ సిరీస్?తోపాటు వరుణ్ ఆసియా గేమ్స్? నుంచి కూడా దూరమయ్యాడు. దీంతో సెలక్టర్లు అతడి రిప్లేస్?మెంట్?గా ఐపీఎల్ స్టార్, స్పిన్ ఆల్?రౌండర్ విప్రజ్ నిగమ్?ను ఎంపిక చేసినట్లు ప్రముఖ వార్తా సంస్థ పీటీఐ తమ రిపోర్ట్?లో పేర్కొంది. "గాయం కారణంగా వరుణ్ కొద్దిరోజులు అందుబాటులో ఉండడు. అతడు గాయం నుంచి కోలుకోవాల్సి ఉంది. దీంతో అతడు ఈ పోటీలకు దూరమయ్యాడు. అయితే అతడి రిప్లేస్?మెంట్ కోసం సెలక్టర్ల జాబితాలో విప్రాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ ఇద్దరి పేర్లు ఉన్నాయి. అయితే లెగ్ స్పిన్నర్? కమ్ ఆల్?రౌండ్ విప్రజ్? నిగమ్? వైపే సెలక్టర్లు మొగ్గు చూపించారు. రాబోయే ఆసియా గేమ్స్?లో వరుణ్ స్థానాన్ని విప్రజ్ నిగమ్ భర్తీ చేయనున్నాడు" అని బీసీసీఐ వర్గాలు చెప్పినట్లు పీటీఐ పేర్కొంది. విప్రాజ్ నిగమ్ బౌలింగ్?తోపాటు బ్యాటింగ్?లోనూ మెరుపులు మెరిపించగలడు. 2025లో ఐపీఎల్‌లో ఎంట్రీ ఇచ్చిన అతడు ఆకట్టుకున్నాడు. ఈ టోర్నీలో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని కూడా ప్రదర్శించాడు. టీ20ల్లో స్ట్రైక్ రేట్ 176గా ఉండడం విశేషం. విప్రాజ్ బంతితో రాణించడమే కాకుండా, లోయార్డర్‌లో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ఉంది. కాగా, ఆఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 35 ఏళ్ల వరుణ్ చక్రవర్తి గాయపడ్డాడు. మ్యాచ్ తర్వాత అతను అసౌకర్యంగా ఉన్నట్లు తెలిపాడు. ఆ తర్వాత అతడికి ఎమ్?ఆర్?ఐ స్కాన్ చేయించగా, పక్కటెముకల్లో గాయం ఉన్నట్లు తేలింది. దీంతో అతడిని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు పంపించారు. అక్కడ కొన్ని రోజులు రిహబిలిటేషన్ చేయనున్నాడు. ఇటీవలే హ్యామ్‌స్ట్రింగ్ సమస్య నుంచి కోలుకుని జాతీయ జట్టులోకి తిరిగి వచ్చిన వరుణ్ మళ్లీ తొలి మ్యాచ్?లోనే గాయపడడం అతడికి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. కాగా, కుల్దీప్?ను కాదని విప్రజ్??ను ఎంపిక చేయడంపై ఓ కారణం ఉంది. ఈనెలలో ఆఖరి వారంలో భారత్ జట్టు వెస్టిండీస్?తో వన్డే సిరీస్ ఆడాల్సి ఉంది. ఇందులో కుల్దీప్ బరిలో దిగనున్నాడు. అందుకే విప్రజ్?ను ఆసియా గేమ్స్?కు పంపించారు.జపాన్‌లోని ఐచి- నగోయాలో సెప్టెంబర్ 19 నుంచి ఆసియా క్రీడలు ప్రారంభం కానున్నాయి. పురుషుల క్రికెట్ పోటీలు సెప్టెంబర్ 24న మొదలవుతాయి. అయితే భారత జట్టు నేరుగా క్వార్టర్-ఫైనల్ దశ నుంచే తన పోరాటాన్ని ప్రారంభిస్తుంది.

# వైభవ్ తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే

అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా ఆన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు. దీంతో ఆఖరి పోరులో ఎవరికి విశ్రాంతి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక ఈ ఈ సిరీస్ ను ఇప్పటికే 2-0తో ఇండియా కైవసం చేసుకోగా, స్వదేశంలో శ్రేయస్ కిదే తొలి సిరీస్ విక్టరీ కావడం విశేషం.





స్పోర్ట్స్ డెస్క్ :

# భారత్‌లోనే జరగనున్న ఐపీఎల్ 2027 వేలం

గత కొన్ని ఏళ్లుగా విదేశాల్లో ఐపీఎల్ వేలాన్ని నిర్వహించే ట్రెండ్‌కు బీసీసీఐ బ్రేక్ వేసింది. మంగళవారం జరిగిన ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక సమావేశంలో 2027 ఐపీఎల్ మినీ వేలాన్ని మన భారతదేశంలోనే నిర్వహించాలని నిర్ణయించారు! 2023లో కొచ్చిలో జరిగిన వేలం తర్వాత దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో వేలాలు జరిగాయి. అయితే, 2028లో నిర్వహించే మెగా వేలాన్ని మళ్లీ విదేశాల్లో నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి మినీ వేలాన్ని మాత్రం స్వదేశంలోనే నిర్వహించనున్నారు. మినీ వేలం కోసం తమ యాజమాన్యం, విశ్లేషకుల బృందాలను విదేశాలకు తీసుకెళ్లడం వల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఫ్రాంచైజీలు బీసీసీఐకి విన్నవించాయి. గతేడాది అబుదాబి వేలం సందర్భంగానే టీమ్స్ ఈ అభ్యంతరాలను బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లాయి. ఫ్రాంచైజీల అభిప్రాయాలకు గౌరవమిస్తూ, వేలాన్ని భారతదేశంలోని ఏదో ఒక నగరంలో నిర్వహించాలని ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయించింది.అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలం భారతదేశంలో వివాహాల సీజన్ కావడంతో, వేలం వేదిక ఎంపిక కాస్త సవాలుగా మారింది. వేలం నిర్వహణతో పాటు 10 ఫ్రాంచైజీల బృందాలు, బీసీసీఐ అధికారుల వసతి కోసం కనీసం 100కి పైగా 5-స్టార్ హోటల్ గదులు రెండు రోజుల పాటు అవసరం అవుతాయి. హోటల్ గదుల లభ్యతను బట్టి ఏ భారతీయ నగరంలో వేలం నిర్వహించాలనేది త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు. మరోవైపు ఐపీఎల్‌లో ఎంతో వివాదాస్పదమైన 'ఇంపాక్ట్ ప్లేయర్' నియమంపై బీసీసీఐ ఇంకా ఏటూ తేల్చలేదు. ఈ రూల్‌ను కొనసాగించాలా వద్దా అనే దానిపై ఫ్రాంచైజీలలో విభిన్న అభిప్రాయాలు ఉన్నాయి. జట్టు నిర్మాణాన్ని ఈ నియమాన్ని బట్టే రూపొందించుకున్నామని, కాబట్టి దీనిపై హడావుడిగా కాకుండా వచ్చే ఏడాది నిర్ణయం తీసుకోవాలని కొన్ని జట్లు కోరుతున్నాయి. దీనిపై స్పష్టత కోసం మరో నెల రోజుల్లో ప్రత్యేకంగా గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం కానుంది.

## 'ది ప్యారడైజ్' ప్రమోషన్స్

# 'జడల్ జమానా షురూ'




సెప్టెంబర్ 17 నుంచి నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమా ప్రచార జోరు మొదలు కానుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్న నేపథ్యంలో చిత్ర బృందం భారీ ప్రీ రిలీజ్ టూర్‌కు శ్రీకారం చుట్టింది. 'జడల్ జమానా షురూ' అంటూ ప్రకటించిన ఈ ప్రచార కార్యక్రమాల్లో నాని స్వయంగా పాల్గొననున్నారు. సెప్టెంబర్ 17న చెన్నైలో అభిమానులు, మీడియాతో ముచ్చటించనున్న నాని.. 18న బెంగళూరులో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. 19న కొచ్చిలో ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం 21న హైదరాబాద్‌లో భారీ ప్రీ రిలీజ్ వేడుకతో ఈ పర్యటన ముగియనుంది ఇప్పటికే విడుదలైన 'ది ప్యారడైజ్' ప్రచార చిత్రాలు, టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ నేపథ్యంలో నాని వరుసగా ప్రధాన నగరాల్లో పర్యటిస్తూ సినిమాను ప్రమోట్ చేయనుండటంతో అంచనాలు మరింత పెరుగుతున్నాయి. మరోవైపు 'జడల్ జమానా' మొదలైందంటూ చిత్ర బృందం చేసిన ప్రకటనతో అభిమానుల్లో సందడి నెలకొంది.





## డింపుల్ హయాతి స్పెషల్ సాంగ్..

విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'ఆదర్శకుటుంబం'. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సినిమా అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఇటీవల విడుదలైన టీజర్‌లో సాధారణ బ్యాంకు ఉద్యోగి పాత్రలో వెంకటేష్‌ను త్రివిక్రమ్ చూపించిన తీరు ఆకట్టుకుంది. భార్య చేసిన అప్పులతో ఇబ్బందులు పడే వ్యక్తికి లాటరీ తగిలితే ఏం జరుగుతుందనే ఆసక్తికరమైన అంశాన్ని కామెడీతో మేళవించినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి కథానాయికగా నటిస్తుండగా.. నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ప్రైవల్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. క్రేజీ బ్యూటీ డింపుల్ హయాతి కూడా ఈ ప్రాజెక్టులో భాగమైనట్లు సమాచారం. ముఖ్యంగా సినిమాలో ఓ ప్రత్యేక గీతం ఉండబోతుందని, ఇందులో డింపుల్ హయాతితో పాటు నివేథా పేతురాజ్ కూడా సందడి చేయనున్నారని తెలుస్తోంది. అయితే ఈ విషయంపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

### రూ.1000 కోట్ల క్లబ్‌లో

## మమితా బైజు

సౌత్‌లో ప్రస్తుతం మమితా బైజు పేరు మారుమోగుతోంది. తక్కువ సమయంలోనే స్టార్‌డమ్ అందుకున్న ఈ భామ.. ఏడాది తిరగకుండానే ఆమె నటించిన సినిమాల కలెక్షన్లు కలిపి రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరినట్లు ప్రచారం జరుగుతోంది. సినిమా ఫలితంతో సంబంధం లేకుండా ఆమె పోషించిన పాత్రలు ప్రత్యేకంగా నిలుస్తుండటం విశేషం. విజయ్ 'జన నాయగన్', సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'బెత్లహోం కుటుంబ యూనిట్', ప్రదీప్ రంగనాథ్‌తో 'డ్యూడ్', ధనుష్‌తో 'కర' చిత్రాల్లో మమిత నటించారు. వీటిలో కొన్ని చిత్రాలు బాక్సాఫీస్ వద్ద విజయవంతం కాగా, మరికొన్ని ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. అయితే ఆయా సినిమాల్లో మమితా బైజు పాత్రలు, నటన మాత్రం ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వరుస అవకాశాలతో సౌత్‌లో తన క్రేజ్‌ను ఆమె మరింత పెంచుకుంటున్నారు.



## డిసెంబర్ రేసు నుంచి 'ఫౌజీ' వాయిదా?

రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పాన్ ఇండియా పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలుత డిసెంబర్ 3న సినిమాను విడుదల చేయాలని భావించినప్పటికీ, సీజీఐ, గ్రాఫిక్స్ పనులు పూర్తికాకపోవడంతో డిసెంబర్ రిలీజ్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవుట్‌పుట్ విషయంలో దర్శకుడు హను రాఘవపూడి రాజీపడకపోవడంతో మరింత సమయం అవసరమవుతున్నట్లు ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం. దీంతో 2027 జనవరి 26న 'ఫౌజీ'ని విడుదల చేసే ఆలోచనలో చిత్ర బృందం ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే సంక్రాంతి బరిలో విడుదలయ్యే సినిమాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. మరోవైపు మార్చి 2027లో విడుదల కావాల్సిన ప్రభాస్ **'స్పిరిట్'**పై కూడా 'ఫౌజీ' రిలీజ్ మార్పు ప్రభావం చూపే అవకాశమున్నట్లు టాలీవుడ్‌లో చర్చ జరుగుతోంది.



### వినాయక చవితి వేడుకల్లో మెరిసిన

## అలియా భట్

ముంబై: బాలీవుడ్ నటి అలియా భట్ వినాయక చవితి వేడుకల్లో సంప్రదాయ అందంతో ఆకట్టుకున్నారు. అంబానీ నివాసంలో జరిగిన గణేశ్ చతుర్థి వేడుకలకు హాజరైన ఆమె ప్రత్యేకంగా డిజైన్ చేసిన హౌస్ ఆఫ్ మసాబా సిల్వర్-గ్రీన్ టిష్యూ చీరలో మెరిశారు. బంగారు ఎంబ్రాయిడరీ అంచులతో ఉన్న చీరకు స్ట్రక్చర్డ్ స్ట్రాప్‌లెస్ కార్సెట్ బ్లౌజ్‌ను జత చేశారు. చాంద్‌బాలీ చెవిపోగులు, వింటేజ్ తరహా కఫ్‌లు, ఉంగరాలతో అలియ తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నారు. బిందీ, బ్రాంజ్ టోన్ స్మోకీ ఐ మేకప్, మధ్య పాపిట తీసి వదిలేసిన వేవీ హెయిర్‌స్టైల్ ఆమె సంప్రదాయ లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల విడుదలైన 'ఆల్ఫా' ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వసూళ్లు సాధించకపోవడంతో అలియా నటనతో పాటు ఆమె లుక్‌పై కూడా చర్చ జరిగింది. తాజాగా సంప్రదాయ చీరలో కనిపించడం ద్వారా మరోసారి తన సహజమైన గ్లామర్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. ఈ ఫెస్టివ్ లుక్‌పై అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. అలియా నిర్మాతగా వ్యవహరిస్తున్న కమింగ్-ఆఫ్-ఏజ్ రొమాంటిక్ కామెడీ 'డోంట్ బీ షై' సెప్టెంబర్ 25, 2026న అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రీమియర్ కానుంది.


Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com